ప్రజాశక్తి

శుక్రవారం 16 ఫిబ్రవరి 2024   8 పేజీలు

గుంటూరు

పల్నాడు



రాజధాని పేదలకు తీపి కబురు

- పింఛను సొమ్ము రూ.5 వేలకు పెంపు
- ఫిరంగిపురం కార్మెల్ ఆలయకొండకు ఘాట్ రోడ్డు మంజూరు
- రేపూడిలో వాలంటీర్ల వందనం సభలో పిఎం జగన్ హామీలు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

రాజధానిలో తొమ్మిదేళ్లగా పనుల్లేక అల్లాడుతున్న వ్యవసాయ కార్మికులు, నిరుపేదలకు ఇస్తున్న పింఛను సొమ్మును వచ్చే నెల నుంచి రూ.5 వేలకు పెంచుతున్నట్టు సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించారు. 2015లో రాజధానిలోని 29 గ్రామాలకు చెందిన 33 వేల ఎకరాలను రైతుల నుంచి సిఆర్‌డిఎ భూసమీకరణ ద్వారా తీసుకోవడంతో వ్యవసాయ కార్మికులు, పేదలు ఉపాధి కోల్పోయారు. గత ప్రభుత్వం దాదాపు 17 వేల మందికి రూ.2500 చొప్పున ప్రతినెలా పెన్షన్ ఇచ్చింది. ఈ సొమ్మును రూ.5 వేలకు పెంచుతామని 2019 మూడు రాజధానుల బిల్లు సందర్భంగా సిఎం జగన్ ప్రకటించినా ఆచరణకు నోచలేదు. ఈ అంశంపై ఎమ్మెల్యే మేకతోటి సుచరిత గురువారం సాయంత్రం రేపూడిలో జరిగిన వాలంటీర్లకు వందనం సభలో ప్రస్తావించారు. ఇందుకు సిఎం జగన్ అంగీకరించారు. వచ్చేనెల నుంచి రూ.5 వేలు పింఛను ఇవ్వనున్నట్టు పకటించారు. ఫిరంగిపురంలోని కార్మెల్ దేవాలయానికి ఘాట్‌రోడ్డు నిర్మాణం చేపట్టాలని సుచరిత కోరగా ఇందుకూ అంగీకరించి రూ.39 కోట్లు మంజూరు చేస్తున్నట్టు సిఎం ▶ 2లో

తాడేపల్లి రూరల్ మండలంలో ప్రచారం నిర్వహిస్తున్న జొన్నా శివశంకర్ , డి వెంకటరెడ్డి తదితరులు

నేడు గ్రామీణ బంద్

- పట్టణాల్లో నిరసన ప్రదర్శనలు
- రైతులు, కార్మికుల సమస్యలపైపోరుబాట
- ఢిల్లీ సరిహద్దులో ఆందోళన చేస్తున్న రైతులకు సంఘీభావం

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

రైతులు, కార్మికుల సమస్యలపై సంయుక్త కిసాన్ మోర్చ, కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు దేశవ్యాప్తంగా శుక్రవారం గ్రామీణ బంద్, పారిశ్రామిక బంద్ జరగనుంది. ఇందులో భాగంగా గుంటూరు, పల్నాడు జిల్లాల్లోనూ జంద్ కోసం ఇప్పటికే రైతు, కార్మిక సంఘాలు గత నెల రోజులుగా విస్తృత ప్రచారం చేశాయి. బ్యాంకులు, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా, వ్యాపార సంస్థలను మూసివేసేందుకు రైతు, కార్మిక నాయకులు సన్నద్ధమయ్యారు. గ్రామీణ ప్రాంతాల్లో బంద్‌ను సంపూర్ణంగా నిర్వహించేందుకు ▶ 2లో

యడ్లపాడు మండలంలో వ్యవసాయ కార్మిక సంఘం బంద్ ప్రచారం

డయేరియా బాధితులకు సిపిఎం పరామర్శ

ప్రజాశక్తి-గుంటూరు

కలుషిత నీరు, డ్రెయిన్లు, రోడ్లు సరిగా లేక అనారోగ్య సమస్యలతో అల్లాడుతున్నామని శారదా కాలనీ వాసులు వాపోయారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబురావు, జిల్లా, నగర కార్యదర్శులు పాశం రామారావు, కె.నళినీకాంత్ గురువారం స్థానిక శారదా కాలనీలోని డయేరియా బాధిత ప్రాంతంలో పర్యటించి, బాధితుల్ని పరామర్శించారు. పలువురు మాట్లాడుతూ తమ ఆవేదనను నాయకులకు వివరించారు. వారం, పది రోజులుగా ఈ ప్రాంతంలో దాదాపు ప్రతి ఇంట్లో ఒకరో ఇద్దరో వాంతులు విరోచనాలతో ఇబ్బంది పడుతున్నారన్నారు. కొందరు సమస్య ఎక్కువగా ఉండటంతో ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లామని, వేల రూపాయలు ఖర్చు అయ్యాయని తెలిపారు. ఇంకొందరు స్థానిక అర్బన్ హెల్త్ సెంటర్‌లో, జిజిహెచ్‌లో చికిత్స చేయించుకుంటున్నట్లు చెప్పారు. తాగునీటి పైపులైన్లు లీకుల వల్ల మురికి నీరు వస్తుందని స్థానికులు తెలిపారు. డ్రెయినేజి లేకపోవటంతో మురుగునీరు పారుదల లేక దోమలు పెరిగి రోగాలు వస్తున్నాయన్నారు. ప్రస్తుతం డయేరియా కేసులు ఎక్కువగా వస్తున్నప్పటి నుండి జిఎంసి వారు ట్యాంకర్లతో నీరు సరఫరా చేస్తున్నారన్నారు. వాంతులు, విరోచనాల సమస్యతో

శారదాకాలనీలో పైపులైను మార్చడానికి తీసిన గుంతలను పరిశీలిస్తున్న వి.శ్రీనివాసరావు, ఇతర నాయకులు

మృతి చెందిన పద్మ కుటుంబ దయనీయ పరిస్థితి గురించి స్థానికులు నాయకులు దృష్టికి తీసుకొచ్చారు. వారికి సొంతిల్లు లేదని, అద్దె ఇంట్లో ఉంటున్నారని తెలిపారు. తండ్రి ఇటీవలే చనిపోయాడని, తల్లి అనారోగ్య సమస్యతో మంచం పట్టిందని తెలిపారు. కుటుంబం మొత్తం ఆమెపైనే ఆధారపడిందన్నారు. ఆమె కుటుంబానికి ఇంటి స్థలం, ఇల్లు మంజూరు చేయించాలని స్థానికులు కోరారు. పలుచోట్ల మురుగు కాల్వలో నుండి వేసిన తాగునీటి పైపులైన్లు స్థానికులు చూపించారు. పరిశీలనలో సిపిఎం నాయకులు బి.ముత్యాలరావు, ఎం.ఎ.చిష్టీ, ఎ.నికల్సన్, ఖాసిం షహీద్, దీవెనరావు, కార్తీక్, ఖాశింవలి, అబ్దుల్ సలీం, ఎ.కల్యాణి, పి.ఎస్.శేఖర్‌రెడ్డి, రేట్ పేయర్స్ అసోసియేసన్ నాయకులు సదాశివరావు పాల్గొన్నారు.

యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు

గుంటూరు నగర కమిషనర్ కీర్తి చేకూరి

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక శారదా కాలనీలో నూతనంగా చేపట్టిన సిసి డ్రెయిన్లు, రోడ్ల నిర్మాణ పనుల వలన కొన్ని ప్రాంతాల్లో ఉత్పన్నమైన తాగునీటి పాత పైప్‌లైన్ల మరమ్మతులు, డ్రెయిన్‌ల పక్కన పైప్‌లైన్లు, నీటి కుళాయిలు యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ, పాత జిఐ పైప్‌ల స్థానంలో నూతన పైప్‌లైన్‌లు ఏర్పాటు చేస్తున్నామని నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. శారదాకాలనీలో ప్రస్తుతం రూ.4.3 కోట్ల అంచనాలతో నూతన సిసి డ్రెయిన్లు, రోడ్లు నిర్మాణ పనులు జరుగుతున్నాయని, పనులు చేపడుతున్న క్రమంలో కొన్ని లైన్లలో ఉత్పన్నమైన తాగునీటి పైప్‌లైన్ల మరమ్మతులను వెంటనే చేస్తున్నారని చెప్పారు. ఎక్కడైనా అనారోగ్య సమస్యలు గుర్తిస్తే వారి ఇంటికి వచ్చే తాగునీటి పైప్‌లైన్‌లను పూర్తిగా మార్చి నూతన లైన్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. పాత జిఐ పైప్‌లైన్లు, డ్రెయిన్లకు సమాంతరంగా ఉన్న పైప్‌లైన్‌లను మారుస్తున్నట్లు చెప్పారు. 31 లైన్‌లకు పైప్‌లైన్లలో మురుగునీరు వస్తే వెంటనే తొలగించడానికి నూతనంగా స్కవర్‌లు ఏర్పాటు చేశామన్నారు. 24 ఇళ్లకు పైప్‌లైన్లను మరమ్మతులు చేశామని, 231 డబుల్ ట్యాప్‌లను డమ్మీ చేశామని వివరించారు. డ్రెయిన్‌కు సమాంతరంగా ఉన్నట్లు గుర్తించిన 88 ట్యాప్‌లలో ▶ 2లో

టిడిపి నాయకులపై కాపుకాచి దాడి

- కోర్టుకు వెళ్లి వస్తుండగా గతంలో మాదిరే మరోసారి
- వైసిపి-టిడిపి పాత ఘర్షణల నేపథ్యంలోనే.. 2లో

నేడు గ్రామీణ బంద్

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పటికే పూర్తిస్థాయిలో ప్రచారం నిర్వహించారు. పంటలకు కనీస మద్దతు ధరకు చట్టం చేయాలని, రుణమాఫీ చేయాలని, రైతులకు పింఛన్లు ఇవ్వాలని తదితర డిమాండ్లతో ఢిల్లీ సరిహద్దుల్లో చేస్తున్న రైతుల ఆందోళనకు మద్దతుగా గుంటూరు, పల్నాడు జిల్లాల్లో కూడా శుక్రవారం నిరసన ప్రదర్శనలు జరగనున్నాయి.

కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా సంయుక్త కిసాన్ మోర్చా, ట్రేడ్ యూనియన్ ఐక్య వేదిక పిలుపు మేరకు శుక్రవారం రైతులు, కార్మికులు ర్యాలీలు చేపట్టనున్నారు. గుంటూరు, పల్నాడు జిల్లాలకు చెందిన రైతు సంఘాలు, కౌలు రైతు సంఘాలతో పాటు వ్యవసాయ కార్మికులు ర్యాలీల్లో పాల్గొననున్నారు. వ్యవసాయ రంగంలో నెలకొన్న సంక్షోభాలను తొలగించేందుకు రైతులను ఆదుకునేందుకు డాక్టర్ స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల మేరకు అన్ని పంటలకు పెట్టుబడికి అదనంగా 50 శాతం కలిపి మద్దతు ధర నిర్ణయించాలని, ఈ మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని సంయుక్త కిసాన్ మోర్చా డిమాండ్ చేసింది. రైతులకు రుణాలమాఫీ, రుణ ఉపశమన చట్టం చేయాలని, వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లను తొలగించాలని, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఉపాధి హామీకి కేంద్ర బడ్జెట్‌లో రూ.2 లక్షల కోట్లు కేటాయించి ఏడాదికి 200 పనిదినాలు కల్పించాలని తదితర డిమాండ్లతో గ్రామీణ బంద్ జరగనుంది. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ చేయరాదని, కడప ఉక్కు నిర్మించాలని, విద్యుత్ చట్టసవరణ బిల్లు ఉపసంహరించాలని, స్మార్టు మీటర్ల బిగింపును నిలిపివేయాలని, భూహక్కుల చట్టం ఉపసంహరించాలని, పోలవరం నిర్వాసితులకు తక్షణం పునరావసం, పరిహారం ఇవ్వాలని కిసాన్ మోర్చా నాయకులు పచ్చల శివాజీ, కంచుమాటి అజయ్‌కుమార్, ఏపూరి గోపాలరావు, యు.రాము, సిఐటియు నాయకులు వై.నేతాజి, ఆంజనేయనాయక్, ఎఐయుటిసి నాయకులు హనుమంత రావు, కె.రాంబాబు డిమాండ్ చేశారు. వ్యవసాయాన్ని కాపాడుకునేందుకు రైతులంతా సంఘటితం కావాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఆమోదించిన నూతన మోటారు వాహన చట్టం డ్రైవర్లకు శరఘాతంగా మారిందని మోటారువాహన అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్మికులు కూడా నిరసన ప్రదర్శన చేయనున్నారు. కేంద్ర ప్రభుత్వం రవాణా కార్మికులకు తీవ్ర ఇబ్బందికరంగా రూపొందించిన ఉత్తర్వులు రద్దుచేయాలని కార్మిక సంఘాలు కోరుతున్నాయి.

యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు

(మొదటి పేజీ తరువాయి)

74 ట్యాప్‌లను షిఫ్ట్ చేశామన్నారు. గుంటూరులో అన్ని ప్రాంతాలకు తాగునీరు అందించేందుకు అమృత్ పథకం కింద ప్రభుత్వం రూ.183 కోట్లకు అనుమతులు మంజూరు చేసిందని త్వరలో ఉండవల్లి నుండి గుంటూరు వరకు, సంగంజాగర్లమూడి నుండి గుంటూరుకు రెండో పైప్‌లైన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తామని తెలిపారు. ఇదిలా ఉండగా శారదాకాలనిలో చేపట్టిన పనులను కమిషనర్ ఆదేశాల మేరకు ఎస్ఇ గురువారం పరిశీలించారు.

హ్యాపీ హాస్పటల్లో క్యాన్సర్ అవగాహన శిబిరం

ప్రజాశక్తి-తెనాలి : పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యశాల హ్యాపీ హాస్పటల్లో గురువారం చిన్నారుల్లో సంక్రమించే క్యాన్సర్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. అంతర్జాతీయ పిల్లల క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన సదస్సులో హ్యాపీ హాస్పిటల్ అధినేత డాక్టర్ పవని ప్రియాంక మాట్లాడుతూ చిన్నారులలో క్యాన్సర్ లక్షణాలను గుర్తించే విధానాన్ని వివరించారు. కీళ్ల నొప్పులు, బరువు తగ్గటం, ఎక్కువగా అలసిపోవడం, కళ్ళలో తెల్లటి మచ్చల వంటివి క్యాన్సర్ లక్షణాలుగా చెప్పారు. దీనిని నివారించేందుకు బలవర్ధకమైన ఆహారం తీసుకోవాలని, ఉదయం పూట శరీరానికి సూర్య కిరణాలు తాకే విధంగా ఉండాలని, క్యాన్సర్ నివారణకు అందుబాటులోకి వచ్చిన వ్యాక్సిన్ గురించి తల్లిదండ్రులు తెలుసుకొని తగు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ తెనాలి యూనిట్ చైర్పర్సన్ ఎం భానుమతి, ఎం శ్రీమన్నారాయణ, కౌన్సిలర్ వీర్లపాటి విజయలక్ష్మి, వైద్యశాల సిబ్బంది నందకుమార్, జానకి, సౌందర్య పాల్గొన్నారు.

టిడిపి నాయకులపై కాపుకాచి దాడి

- **కోర్టుకు వెళ్లి వస్తుండగా గతంలో మాదిరే మరోసారి**
- **వైసిపి-టిడిపి పాత ఘర్షణల నేపథ్యంలోనే..**

ప్రజాశక్తి - మాచర్ల

పలనాడు జిల్లా దుర్గి మండలం జంగమేశ్వరపాడుకు చెందిన గాజుల అంజి, పాశం రాజు, గుమ్మ శ్రీనుపై వైసిపికి చెందిన వారు గురువారం కాపుకాసి దాడి చేశారు. తీవ్ర గాయాలు పాలలైన వారిని మాచర్ల ప్రభుత్వాసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్సానంతరం మెరుగైన చికిత్స కోసం నరసరావుపేటకు తరలించారు. క్షతగాత్రులు ముగ్గురూ జంగమేశ్వరపాడుకు చెందిన వారుకాగా వైసిపి అధికారంలోకి వచ్చాక గ్రామం విడిచి సమీపంలోని మించాలపాడులో నివాసం ఉంటున్నారు. పాత ఘర్షణలు ఉండడం, జంగమహేశ్వరపాడు ఫ్యాక్షన్ గ్రామం కావడంతో తమపై దాడులు జరుగుతుండడంతో వారు గ్రామాన్ని వీడి వెళ్లారు. అయితే గతంలో నమోదైన కేసుల్లో వాయిదాకు గురువారం గురజాల కోర్టుకు హాజరై తిరిగి వస్తుండగా ప్రత్యర్థులు కాపుకాసి దాటికి పాల్పడినట్లు తెలిసింది. అంజి, రాజు, ఒక వాహనంపై, గుమ్మా శ్రీను మరో ద్విచక్ర వాహనంపై గురజాల వెళ్లి తిరిగి మించాలపాడు వెళుతుండగా మార్గమధ్యంలో ప్రత్యర్థులు కాపుకాసి వాహనంతో ఢీకొట్టారు. కింద పడిన వారిపై రాడ్లు, కర్రలతో దాడులు చేశారు. కాళ్లు, చేతులపై తీవ్రంగా కొట్టడంతో అవి దెబ్బతిన్నాయి. అంజికి తలపైనా గాయాలు కావడంతో పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. జంగమేశ్వరపాడులో కొద్ది నెలల క్రితం ఓ టిడిపి నాయకుడు హత్య జరిగింది. అదే గ్రామానికి చెందిన జల్లయ్యను ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా దాడి చేసి గ్రామంలోకి తీసుకువచ్చి కొట్టడంతో చనిపోవడంతో గతంలో తీవ్ర సంచలనమైంది. మృతదేహాన్ని కూడా స్వగ్రామం తీసుకురాకుండా అడ్డుకోవడంతో అతని బంధువుల ఊరు వినుకొండ మండలం తీసుకువెళ్లి అంత్యక్రియలు పూర్తి చేశారు. తాజా తాడిలో ఈరోజు జరిగిన దాడిలో సుమారు 15 మంది పాల్గొన్నట్లుగా క్షతగాత్రులు చెబుతున్నారు.

బాధపడే రోజులు త్వరలోనే : బ్రహ్మారెడ్డి

మాచర్ల నియోజకవర్గంలో అరాచకం రాజ్యమేలుతోందని, ప్రతిపక్ష పార్టీ వారిని వెంటాడి, వేటాడి చంపటం, దాడులు చేయడం వంటివి పోలీసుల అండదండలతోనే జరుగుతున్నాయని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి మండిపడ్డారు. దుర్గి మండలం జంగమేశ్వరపాడుకు చెందిన టిడిపి నాయకులపై దాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. మాచర్ల ప్రభుత్వ ఆసుపత్రికి గురువారం వచ్చి క్షతగాత్రులను పరామర్శించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ నాయకులకు రక్షణ లేదని, తీవ్రంగా దాడులు జరుగుతున్నాయని అన్నారు. తాజాగా దాడి చేసింది కూడా బీసీ నాయకులపైనేనన్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జంగమేశ్వరపాడుకు చెందిన టిడిపి నాయకులు వేధింపులు తట్టుకోలేక వేరువేరు గ్రామాలకు వెళ్లి బతుకుతున్నారని, అయినా వారిని వదిలిపెట్టడం లేదని అన్నారు. ఎక్కువకాలం ఈ పద్ధతి నడవదని, బాధపడే రోజులు తొందరలోనే ఉన్నాయని హెచ్చరించారు. దాడులకు ప్రతీకారం తీర్చుకుంటామన్నారు. జంగమేశ్వరపాడే కాదని గుళ్లపాడు, గొట్టిపాళ్లా, ఆత్మకూరు ఇలా నియోజకవర్గంలో ఎన్నో గ్రామాల్లో వైసిపికి అనుకూలంగా లేకపోతే కేసులు పెట్టడం, వేధించటం, దాడులు చేయటం, గ్రామంలో నుంచి వెళ్లగొట్టడం జరుగుతోందని అన్నారు. ఇంత అరాచక పాలన ఎప్పుడూ చూడలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా ప్రభుత్వ ఆసుపత్రి వద్ద తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడం, బాధితులను నరసరావుపేట తరలించడంతో బ్రహ్మారెడ్డి అక్కడి నుండి వెళ్లిపోయారు.

దాడి చేసిన దుండగులను శిక్షించాలి : జీవీ ఆంజనేయులు

టిడిపి నాయకులపై వైసిపి వారు చేసిన హత్యాయత్నాన్ని టిడిపి తీవ్రంగా ఖండిస్తున్నట్లు టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు జీవీ ఆంజనేయులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గుమ్మ శ్రీను, గాజుల అంజి, కాసిం రాజు ద్విచక్ర వాహనాలపై వెళుతుండగా వారిని మరో వాహనంతో వెనుక నుండి ఢీ కొట్టడమే కాకుండా మారణాయుధాలతో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడడం అమానుషమన్నారు. గతేడాది జల్లయ్యను చంపిన కేసులో నిందితులకు సరైన శిక్ష పడకపోవడంతో వైసిపి శ్రేణులు రెచ్చిపోతున్నాయని, వైసిపికి అనుకూలంగా పోలీసులు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. హత్యకు యత్నించిన వైసిపి గుండాలను గుర్తించి వెంటనే అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రూ.5.30 కోట్లతో అంకిరెడ్డిపాలెం చెరువు అభివృద్ధి

చెరువు అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న శ్రీలక్ష్మీ, అప్పిరెడ్డి

ప్రజాశక్తి-గుంటూరు

గ్రామాలు, పట్టణాల్లో ఉన్న చెరువుల అభివద్ధి వలన ఆహ్లాదంతోపాటు, భూగర్భ జలాల పెంపుదల సాధ్యమవుతుందని రాష్ట్ర పురపాలక శాఖ ప్రత్యేక కార్యదర్శి వై.శ్రీలక్ష్మీ అన్నారు. గురువారం జిఎంసి పరిధిలోని అంకిరెడ్డిపాలెం చెరువులో అమత్, ఏపి గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పోరేషన్(ఏపిజిబిసి) ఆధ్వర్యంలో జరుగుతున్న అభివద్ధి పనులను ప్రభుత్వవిప్ లేళ్ళ అప్పిరెడ్డి, ఏపిజిబిసి అధికారులతో కలిసి పరిశీలించి, చెరువు అభివద్ధి పనుల ప్లాన్‌ని మ్యాప్ ద్వారా వివరాలు అడిగి తెలుసుకొని, అంతర్జాతీయ ప్రమణాలతో పనులను వేగంగా చేయాలని అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మీ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి హరితవనాల పెంపు, చెరువుల అభివద్ధి ద్వారా పర్యావరణహిత అభివద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. అంకిరెడ్డిపాలెం చెరువును రూ.5.30 కోట్ల అమత్ 2.0, ఏపిజిబిసి నిధులతో అత్యంత సుందరంగా అభివద్ధి చేస్తున్నామని తెలిపారు. చెరువుకట్ట బలోపేతం, కాంపౌండ్‌వాల్, చెరువుకట్ట కుంగకుండా రాతి బండల ఏర్పాటు, పచ్చదనం కోసం గ్రాస్‌లాన్, మొక్కలను పరిశీలించారు. పెండింగ్ పనులను నిర్దేశిత గడువు మేరకు పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని ఏపిజిబిసి అధికారులను ఆదేశించారు. వాకింగ్ ట్రాక్‌ని ప్రజలు అధిక సంఖ్యలో వినియోగించుకునే అవకాశం ఉన్నదని అందుకు తగిన విధంగా ఏర్పాటు చేయాలన్నారు. కాంపౌండ్ వాల్ ఎత్తుగా ఉండేలా చూడాలని, ట్రాక్‌లో టాయిలెట్ సదుపాయం ఏర్పాటు చేయాలన్నారు. పర్యటనలో ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ఎం.డీ రాజశేఖరరెడ్డి, అధికారులు, అమత్ ప్రతినిధులు, జిఎంసి ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

రాజధాని పేదలకు తీపి కబురు

(మొదటి పేజీ తరువాయి)

చెప్పారు. వాలంటీర్లకు అభినందన, సత్కారం సభలో ఉత్తమ గ్రామ, వార్డు సచివాలయ వాలంటీర్లకు సేవామిత్ర, సేవారత్న, సేవా వజ్ర అవార్డుల ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ వాలంటీర్లు రాబోయే కాలంలో కాబోయే నాయకులని వ్యాఖ్యానించారు. చంద్రబాబు వస్తే వాలంటీర్ల వ్యవస్థ, సంక్షేమ పథకాలు ఉండవన్నారు. గత 58 నెలలుగా వాలంటీర్లు అందిస్తున్న సేవలు భవిష్యత్తులో కూడా కొనసాగాలంటే మరోసారి వైసిపిని గెలిపించాలని, ఇందుకోసం రెండు నెలలు కష్టపడాలని వాలంటీర్లను కోరారు. వాలంటీర్లు, సచివాలయాల వ్యవస్థ మెరుగైన ఫలితాలు ఇచ్చిందని, ఈ వ్యవస్థతోనే వచ్చే ఎన్నికల్లో తాము విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. టిడిపి హయాంలో జన్మభూమి కమిటీలు దోపిడీని తట్టుకోలేక ప్రజలు వైసిపిని గెలిపించారన్నారు. టిడిపి ఇచ్చిన హామీలను అమలు చేయదని, తాను ఇచ్చిన అన్ని సంక్షేమ పథకాలు అమలు చేసి చూపానని చెప్పారు. ఇంటింటి ఆరోగ్యాన్ని పరిరక్షించేందుకు విలేజ్ క్లినిక్‌లు, ఇంటింటిని జల్లెడ పడుతూ ఏ పేదవాడూ వైద్యం కోసం అప్పులు పాలయ్యే పరిస్థితి ఉండకూడదని, ఆ వైద్యం వారికి ఇంటి వద్దే అందాలనే తపనతో ఆరోగ్యసురక్ష చేపట్టామన్నారు. విద్య, వైద్య, వ్యవసాయం, సంక్షేమ రంగాలకు తమ ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. సేవావజ్రాలకు రూ.45 వేలు, సేవారత్నాలుకు రూ.30 వేలు, సేవా మిత్రలకు రూ.15 వేలు చొప్పున ఇస్తున్నామని, ఈ ఏడాది కూడా ప్రతి నియోజకవర్గం నుంచి ఐదుగురు చొప్పున 875 మంది వాలంటీర్లకు సేవావజ్ర అవార్డులతో సత్కరిస్తున్నామని సిఎం చెప్పారు. ప్రతి మండలం, ప్రతి మున్సిపాల్టీ పరిధి నుంచి కనీసం ఐదుగురు, ప్రతి కార్పొరేషన్ పరిధి నుంచి 10 మంది చొప్పున 4150 మంది వాలంటీర్లకు సేవారత్న అవార్డులు ఇస్తున్నట్టు తెలిపారు. వాలంటీర్లు తమ ప్రభుత్వంను తిరిగి కొనసాగించేందుకు యుద్ధానికి సిద్ధం కావాలన్నారు. వాలంటీర్ చెల్లెమ్మలంతా కొంగు బిగించి ఈ పేదల వ్యతిరేకులు, పెత్తందార్ల మీద, మోసగాళ్ల మీద యుద్ధానికి సిద్ధమేనని ప్రకటించాలన్నారు. వాలంటీర్లు, సచివాలయాల ద్వారానే గ్రామస్వరాజ్యం వచ్చిందని అన్నారు. సభలో వాలంటీర్లను సిఎం ఘనంగా సత్కరించారు. సిఎంను ఎమ్మెల్యే మేకతోటి సుచరిత, పలువురు వైసిపి నాయకులు, వాలంటీర్లు సన్మానించారు.

10,552 మంది వాలంటీర్ల ఎంపిక

గుంటూరు జిల్లాలో 11,087 మంది వాలంటీర్లు పని చేస్తుంటే వీరిలో అర్హత పొందిన అవార్డీలు 10,552 మంది వాలంటీర్లు ఈ రోజు సేవా మిత్రా, సేవారత్న, సేవా వజ్ర అవార్డులకు ఎంపికయ్యారు. వీరు రూ.16 కోట్ల 14 లక్షల 15 వేలు నగదు పురస్కారాలకు ఎంపిక చేసినట్టు జిల్లా కలెక్టర్ వేణుగోపాలరెడ్డి తెలిపారు. సంవత్సర కాలంగా నిరంతరాయంగా సేవలందిస్తున్న వాలంటీర్లకు, వారు అందించిన సేవల ఆధారంగా 3 కేటగిరీల్లో పురస్కారాలు అందిస్తామన్నారు.

ముగింపు సదస్సులో మాట్లాడుతున్న జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు, 'కాన్ టెంపరరీ స్ట్రాటజీస్..' సెమినార్‌లో విసి, తదితరులు, ఎఎన్‌యు రేడియో కేంద్రంలో జర్నలిజం విభాగాధిపతి డాక్టర్ జి. అనిత

సాహిత్యం సమాజ హితం కావాలి

ప్రజాశక్తి - ఎఎన్‌యు

తెలుగు శాఖలో ముగిసిన జాతీయ సదస్సులి సాహిత్యం పరమావధి అని, అది సమాజ హితం కావాలని విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య పి .రాజశేఖర్ అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం లోని తెలుగు ప్రాచ్య భాష విభాగం ఆధ్వర్యంలో రెండు రోజులుగా జరుగుతున్న 'సంస్కృతాంధ్ర నవలా సాహిత్యం సామాజిక చైతన్యం' అనే జాతీయ సదస్సు గురువారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న వీసీ రాజశేఖర్ మాట్లాడుతూ ఏ భాషా సాహిత్యమైన సమసమాజ స్థాపనకు, అభ్యుదయ మార్గానికి దోహదపడినప్పుడే అది చిరస్థాయిగా నిలుస్తుందని అన్నారు. విశిష్ట అతిది రెక్టార్ ఆచార్య పి.వరప్రసాదమూర్తి మాటాడుతూ పాచీన వాల్మీకి మహర్షి నుంచి నేటి ఆధునిక కవులందరి సాహిత్యం సామాజిక ప్రయోజనమే లక్ష్యంగా సాగిందని అన్నారు. సదస్సులో కీలకోపన్యాస కులుగా పాల్గొన్న ప్రముఖ సినీ రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు మాట్లాడుతూ సాహిత్యం సమాజానికి దర్పణం అని సమా జానికి దూరంగా ఉండే ఏ రచన అయిన నిరుపయోగమేనని చెప్పారు. నేటి యువత, పరిశోధకులు ఉన్నత విలువలు కలిగిన సాహిత్యాన్ని లోతుగా పరిశీలించి, సామాజిక అంశాలను సమాజానికి అందించాలని సూచించారు. సాహిత్య ప్రక్రియే నవల అని అన్నారు. రచనా వ్యాసాంగం సవ్యంగా, వినూత్నంగా చేయాలని సూచించారు. ఆత్మీయఅతిథి, తెలుగు అకాడమీ పూర్వపు సంచాలకులు ఆచార్య సిహెచ్. సుశీలమ్మ, సాహితీ సేవకులు చదలవాడ లక్ష్మి పద్మావతి, విభాగం బి వోఎస్ చైర్మన్ ఆచార్య ఎన్.వి.కృష్ణారావు ప్రసంగించారు. సదస్సు సంచాలకులు ఆచార్య ఈ.మాధవి సదస్సు నిర్వహించిన ఉద్దేశం, లక్ష్యం నెరవేరినట్లు పేర్కొంటూ 100కు పైగా తెలుగు, సంస్కృత భాషలలో పరిశోధన పత్రాలపై వివరించారు. సదస్సులో డాక్టర్ పి. వాసు, బలరామ్, లలిత కుమారి, యశ్వంత్‌రెడ్డి, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

'కాన్ టెంపరరీ స్ట్రాటజేస్..'పై సెమినార్ ప్రారంభం

ఎఎన్‌యు ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో యూజిసి స్పాన్సర్డ్ నేషనల్ సెమినార్ 'కాన్ టెంపరరీ స్ట్రాటజేస్ ఇన్ 'డ్రగ్ ప్రొడక్ట్ డిజైన్, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ప్రారంభమైంది. ముఖ్యఅతిథి విసి ఆచార్య పి. రాజశేఖర్ మాట్లాడుతూ అంతరిక్షానికి, దేహానికి, సాంస్కృతిక సారూప్యతకి, గుత్తాధిపత్య భావజాలానికి మధ్య గల సంబంధాన్ని వివ రించారు. డ్రగ్ మాలిక్యుల్స్ దేహంలోని బయో మాలిక్యుల్స్‌కు రోజు సారుప్యత ఉంటుందని వివరించారు. ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.ప్రమీలా రాణి మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి తక్కువ ఖర్చుతో మందులను తయారు చేయాలని కోరారు. జీవన్ బయోటెక్ వాదశాబాద్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ కె. సోమేశ్వర రావు మాట్లాడుతూ నూతన ఔషధాల పరిశోధనతో ఆర్టి ఫిషియల్ ఇంటెలిజెన్స్ (కృతిమ మేధస్సు) ప్రాముఖ్యతను వివరించారు. కృతిమ మేధస్సును ఉప యోగించి డిప్రెషన్ తగ్గించటానికి ఉప యోగించే 'బూప్రిపియాన్' అనే మందు స్మోకింగ్ హ్యాబిట్ ను తగ్గించటానికి కూడా ఉపయోగిస్తారని తెలిపారు. ఊటీ లోని జె.యస్.యస్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ నుంచి డాక్టర్ కె.వి.వి. ఎస్.నారాయణ రెడ్డి మాట్లాడుతూ రోగులకు, రోగ నిర్ధారణ అనంతరం వారికి సరిపోయే మందు మోతాదును కచ్చి తత్వంతో 3డి ప్రింటింగ్ టెక్నాలజీ ద్వారా అందించవచ్చని తెలిపారు. సెమీనార్ డైరెక్టర్ డాక్టర్ గాయత్రి రమ్య మాట్లాడారు. హైదరాబాదులోని నైపర్ నుంచి పాల్గొన్న డాక్టర్ నీలేష్ మెహ్రా ఆఫ్తార్మిక్ ప్రోడక్ట్ డెవలప్మెంట్ ఫ్రమ్ బెంచ్ టు బెడ్ సైడ్ అనే అంశంపై కీలక ఉపన్యాసం చేశారు. .

ఎఎన్‌యు రేడియో సేవలు విస్తృతం

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని కమ్యూనిటీ రేడియో సేవలను విస్తృతం చేస్తున్నట్లు జర్నలిజం విభాగాధిపతి డాక్టర్ జి. అనిత తెలిపారు. రేడియో కార్యకలాపాలను ఎక్కువ మందికి చేరవేసే క్రమంలో కేంద్ర ప్రభుత్వం ఒక ప్రాజెక్టును కేటాయించినట్లు తెలిపారు. దానితో పాటు స్థానికంగా ఉండే సమాచారాన్ని సమాజానికి అందించేందుకు కొత్త ప్రణాళిక రూపొందించినట్లు వివరించారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, రైతులు, మహిళలు అన్ని వర్గా లకు సంబంధిం చిన సమాచారం అందించేం దుకు రేడియో ముస్తా బైనట్లు పేర్కొన్నారు. వర్సిటీ కి ప్రత్యేకంగా కేటాయించిన 91.2 ఎఫ్ఎం ద్వారా ఎఎన్‌యు రేడియో సేవలను పొందవచ్చని చెప్పారు. వర్సిటీలోని జర్నలిజం విద్యార్థులతో పాటు అధ్యాపకులు, ఉద్యోగులు, మేధా వులు, పరిశోధకులు, చుట్టు ప్రక్కల గ్రామాల రైతులు ఆయా అంశాలపై వారికున్న సమా చారాన్ని, వారిలోని భావాలను తమ రేడియో ద్వారా సమాజానికి చేరవేయవచ్చని అన్నారు.

మిర్చి నిల్వలు

	బ్యాగులు
మిర్చి దిగుమతి	: 1,24,248
మిర్చి ఎగుమతి	: 1,19,823
మిర్చి నిల్వ	: 94,535

మిర్చి ధరలు

	రూపాయలలో
334	9,000 - 20,000
నెం.5	11,500 - 15,500
273	12,500 - 16,000
341	11,000 - 20,500
4884	9,000 - 14,500
సూపర్ 10	9,000- 16,000
	నాన్ ఎసి
తేజ	8,000 - 21,200
బడిగి	10,000 - 21,500
దేవనూరు డీలక్స్	9,000 - 19,500
తాలుకాయలు	8,000 - 21,500

పత్రికా ప్రకటన
మహారాజశ్రీ సత్తెనపల్లి సీనియర్ సివిల్‌జడ్జి వారి కోర్టులో
ఓ.యస్. 166/2015

బిట్వీన్ :
పూదోట విజయకుమార్ .... వాది
అండ్
పూదోట ప్రకాశరావు వగైరాలు ... ప్రతివాదులు
8వ ప్రతివాది : నూతలపాటి ధన్‌రాజు,
తండ్రి : పెదమారయ్య, డోర్ నెం. 8-28
9వ ప్రతివాది : యద్దనపల్లి రాయన్న,
తండ్రి : శౌరయ్య, డోర్ నెం. 8-50/2.
11వ ప్రతివాది : పూదోట కిషోర్‌కుమార్,
తండ్రి: అంతయ్య, డోర్ నెం. 8-98
All are R/o. తురకపాలెం, H/o. దమ్మాలపాడు, ముప్పాళ్ళ మండలం, పల్నాడుజిల్లా
13వ ప్రతివాది : రామడుగు స్వర్ణలత, భర్త : రమేష్, తండ్రి: అంతయ్య, R/o. D.No. S2, Block No.12, Rajeev Houses, Pedda Cheruvu, Narasaraopet Town, Palnadu District.

పై నెంబరు దావాలో వాది మిమ్ములను ప్రతివాదులుగా చేర్చి యున్నందున మీకు దావా సమన్లు పత్రికా ప్రకటన ద్వారా శ్రీ కోర్టువారు ఉత్తర్వు చేసియున్నారు. కావున శ్రీ కోర్టువారు మీ యొక్క హాజరు నిమిత్తం ది. 20-03-2024వ తేదీకి వాయిదా వేసియున్నారు. వాయిదా తేదీన మీరు పై తెలిపిన కోర్టులో స్వయంగా గానీ, వకీలు ద్వారా గానీ ఉదయం 10-30 గం.లకు హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనిచో పై దావాలో మీపై పరోక్షంగా తీర్మానించ బడునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

వాయిదా : 20-03-2024
(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
సత్తెనపల్లి.
ది. 15-02-2024 ఇట్లు
శ్రీ చలువాది చినసత్యనారాయణ, ఎం.ఎ., బి.ఎల్., అడ్వకేట్, సత్తెనపల్లి..

ప్రకటన
మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి చిలకలూరిపేట కోర్టులో
ఐ.ఎ. నెం. 1725/2023 ఓ.యస్. నెం. 101/2021

బిట్వీన్ :
అట్లూరి శ్రీనివాసరావు తండ్రి బ్రహ్మయ్య, డి.నెం. 19-109/1, 19వ బ్లాక్, బిట్రావారి వీధి, చిలకలూరిపేట గ్రామం, పల్నాడుజిల్లా.
.... పిటీషనరు / వాది
ఎదిరి
చెన్నూరి నాగమ్మ (మరణించినారు) మరియు వగైరా
.... రెస్పాండెంట్స్ / ప్రతివాదులు
5. పొదిలి కళ్యాణి, భర్త : చిరంజీవి, డి.నెం. 11-604, దాసరి కాలని, చిలకలూరిపేట గ్రామం మరియు మండలం, పల్నాడుజిల్లా.
6. గోరంట్ల ప్రసన్న లక్ష్మి భర్త : ప్రసాద్, వినుకొండ గ్రామం, పల్నాడుజిల్లా.
9. చెన్నూరి శ్రీలక్ష్మి, తండ్రి : లేటు చిరంజీవి, దాసరి కాలనీ, చిలకలూరిపేట గ్రామం మరియు మండలం, పల్నాడుజిల్లా.

పై నెంబరు గల దావా నందు ఇందలి వాది, ప్రతివాది అయిన చెన్నూరి నాగమ్మపై ప్రామిసరీ నోటు దావా 2021న దాఖలు చేసినారు. ఈ మధ్యకాలంలో చెన్నూరి నాగమ్మ మరణించినందున వారసులను చేర్పించినాము. సదరు వారసుల పిటీషనులో 2 నుండి 10 వరకు రెస్పాండెంట్స్ యుండియున్నారు. సదరు వారసుల పిటీషన్ ఐ.ఎ. 1785/2023 నందు శ్రీ కోర్టు నుండి అందరికీ నోటీసులు పంపగా R5, R6,మరియు R9 నోటీసులు తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. అందువలన శ్రీ కోర్టువారి ఆర్డరు ప్రకారం సదరు R5, R6, మరియు R9 లకు ఈ ప్రకటన ద్వారా సదరు దావా విషయం తెలియపరచగలందులకు ది.07-03-2024న వాయిదా అయివున్నదని తెలియపరచటమైనది. సదరు వాయిదారోజున ఉదయం 10-30 గం.లకు పై కోర్టునందు మీరు స్వయంగా గానీ, వకీలు ద్వారా గానీ హాజరయి మీకు గల ఆక్షేపణలను తెలియపరచ వలయును. లేనిచో సదరు దావా లోని ఐ.ఎ.1785/2023ను మీ పరోక్షమున తీర్మానించ బడునని తెలియపరచడమైనది.

వాయిదాతేది : 07-03-2024 **ఇట్లు**
పోతుల వెంకటేశ్వరరావు,
పిటీషనరు/వాది తరపు అడ్వకేటు,
చిలకలూరిపేట. సెల్ : 9440207917.

మృతుని కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-రొంపిచర్ల

మండల కేంద్రమైన రొంపిచర్లలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన నాయుడు చంద్రశేఖర్ కుటుంబ సభ్యులకు గురువారం వైయస్సార్ బీమా యోజన పథకం కింద ఆర్థిక సహాయం అందజేశారు. చంద్రశేఖర్ కుటుంబ సభ్యులను గ్రామ మాజీ సర్పంచ్ పడాల చక్రారెడ్డి పరామర్శించి (సానుభూతి తెలిపారు. అనంతరం ఈ పథకం కింద రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని మృతుని కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎస్.నాగేశ్వరరావు, గ్రామ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ జ్యోతి పాల్గొన్నారు.

NOTICE

THE ANDHRA CRICKET ASSOCIATION VISAKHAPATNAM

THE ANDHRA CRICKET ASSOCIATION is inviting the quotations to construct the following work in ACASKRBR Cricket Ground, Narasaraopet, Palnadu District.

1. Name of the work :- Construction of Dormitory, Match official rooms and Gymnasium
2. Estimate of Amount For Proposed work :- 98,00,000
3. Eligibility :- Only class V Contractors are eligible
4. Last date for Submission:- 23-02-2024 Of Quotations
5. Contact Number :- 8309880399 For getting Detailed Estimate copy

Secretary
Andhra Cricket Association
Visakhapatnam.

'ఆరోగ్య సురక్ష'ను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-తెనాలి

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మలేరియా అధికారి, ప్రోగ్రాం ఆఫీసర్ టి.మురళీకృష్ణ సుబ్బరాయణం అన్నారు. స్థానిక పినపాడు - 2 సచివాలయం, మున్సిపల్ ఉర్దూ ఎలిమెంటరీ స్కూల్ ఆవ రణలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని, మలేరియా ఎగ్జిబిషన్ స్టాల్ ను కూడా మురళీకృష్ణ పరిశీలించారు. రోగులకు మందులను పంపిణీ చేశారు.

ప్రకటన
మహారాజశ్రీ సత్తెనపల్లి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి వారి కోర్టులో
ఓ.యస్.నెం. 10/2020

బిట్వీన్ :
సోమిశెట్టి వెంకట ఉమామహేశ్వరరావు .... వాది
వర్సెస్
పబ్బిశెట్టి సుబ్బారావు .... ప్రతివాది
ప్రతివాది :
పబ్బిశెట్టి సుబ్బారావు,
తండ్రి : నరసింహం,
నివాసం: ప్లాట్ నెం. 302,
సామిమెడోస్ అపార్ట్‌మెంట్,
కో-ఆపరేటివ్ కాలని,
కావలి పట్టణం,
శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరుజిల్లా.

పై నెంబరు దావాలో శ్రీ కోర్టువారు మీ యొక్క హాజరు నిమిత్తం ది. 22-02-2024వ తేదీ వాయిదా వేసియున్నారు. కావున వాయిదా తేదీన పై తెలిపిన కోర్టులో ఉదయం 10-30 గం.లకు స్వయంగా గాని, లేక వకీలు ద్వారా గానీ హాజరయి మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకోవలయును. లేనిచో మీపై పరోక్షంగా తీర్మానించబడునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల మేరకు)
వాయిదాతేది: 22-02-2024
నలబోతు వెంకటేశ్వర్లు
వాది తరఫు న్యాయవాది,
సత్తెనపల్లి. **సత్తెనపల్లి - 522403.**
తేది: 04-01-2024 **ఫోన్ : 92908 75099**

IN THE COURT OF THE HON'BLE XXI JUNIOR CIVIL JUDGE: CITY CIVIL COURT AT HYDERABAD
O.S.NO. 2863 OF 2022

Between:
M/s.Eugia Pharma Specialities Ltd.,
...PLAINTIFF
And
U.Narendra Babu & others.
.. DEFENDANTS

To
1. U.Narendra Babu, S/o.U.Peddavenkaiah, Aged about 22 years, Occ:Private Service, H.No.1-299, Nadikudi Post, Dachepalli (M), Guntur Dist., A.P - 522414.
2. U.Peddavenkaiah, S/o.Late. U.Kotaiah, Aged about 60 years, Occ:Daily Labour, H.No.1-299, Nadikudi Post, Dachepalli (M), Guntur Dist., A.P - 522414.
3. U.Kondalu, S/o.U.Peddavenkaiah, Aged about 32 years, Private Employee, H.No.1-299, Nadikudi Post, Dachepalli (M), Guntur Dist., A.P - 522414.

... Defendant Nos. 1 to 3.

WHEREAS the Plaintiff Company filed the above Suit against you for recovery of damages, the above suit is posted to 22-02-2024 for your appearance, you are hereby summoned to appear either in person through your pleader with your defense if any at 10.30 a.m., on the above said date before the Hon'ble Court failing which the suit will be heard and determined exparte.

// BY ORDER OF THE COURT//
R.CHAKRADHAR,
V.VIMALANAND,
ADVOCATES
6-1-295/1, 2nd FLOOR,
PADMARAO NAGAR,
SECUNDERABAD.

నేడు గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మె

క్రోసూరు మండలంలో ప్రచారం

ప్రజాశక్తి - క్రోసూరు

సంయుక్త కిసాన్ మోర్చ, కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు దేశవ్యాప్తంగా శుక్రవారం జరిగే గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు జి.రవిబాబు పిలుపునిచ్చారు. శుక్రవారం సాయంత్రం నాలుగు గంటలకు క్రోసూరులో చేపట్టే నిరసన ప్రదర్శనలో ప్రజల పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. ఈ మేరకు సిఐటియు, రైతు, కౌలురైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో గురువారం ప్రచారం నిర్వహించారు. రవిబాబు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికుల, రైతుల హక్కులను కాలరాస్తోందన్నారు. ఎన్నికలప్పుడు, ఢిల్లీలో రైతు ఉద్యమం సందర్భంగా ఇచ్చిన హామీలను విస్మరించిందని విమర్శించారు. కార్మికులను బానిసలుగా మార్చేలా లేబర్ కోడ్‌లు తెచ్చిందని, వ్యవసాయాన్ని కార్పొరేట్లకు అప్పగించబూనుకుందని, ప్రభుత్వ రంగ సమస్థలను అమ్మేస్తోందని దుయ్యబట్టారు. ప్రజలను దారుణంగా మోసం చేస్తున్న ఈ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందని, అందుకోసం సాగే పోరాటాల్లో అన్ని రంగాల ప్రజలు భాగస్వామ్యం కావాలని కోరారు.

ప్రజాశక్తి - యడ్లపాడు

శుక్రవారం జరిగే గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు కె.రోశయ్య కోరారు. ఈ మేరకు మండలంలోని పలు గ్రామాల్లో గురువారం ఆటో ప్రచారం చేశారు. యడ్లపాడు, లింగారావుపాలెం, సొలస, కొండవీడు, బోయపాలెం, ఉన్నవ తదితర గ్రామాల్లో ప్రచారం సాగింది. నాయకులు జి.హరిబాబు, శ్రీనివాస్, ఎ.సుబ్బారావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - చిలకలూరిపేట

స్థానిక ఆటో స్టాండ్‌లో సిఐటియు నాయకులు కరపత్రాలు పంపిణీతో ప్రచారం చేశారు. సాయంత్రం ఐదు గంటలకు ఎన్ఆర్‌టి సెంటర్‌లోని అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద నుంచి కళామందిర్ సెంటర్ వరకు శుక్రవారం సాయంత్రం 5 గంటలకు ర్యాలీ ఉంటుందని, అనంతరం బహిరంగ సభ ఉంటుందని సిఐటియు మండల కన్వీనర్ పి.వెంకటేశ్వర్లు చెప్పారు.

చిలకలూరిపేటలో ప్రచారం

ప్రజాశక్తి - అమరావతి

బంద్, సమ్మె జయప్రదం కోసం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. సిపిఎం మండల కార్యదర్శి బి.సూరిబాబు, సిఐటియు నాయకులు ఎం.శ్రీనివాసరావు, ఎఐటియుసి నాయకులు ఎస్.కె ఖాన్, టిఎన్‌టియుసి నాయకులు బి.వెంకటేశ్వరరావు, తెలుగు రైతు సంఘం రాష్ట్ర నాయకులు కె.వసంతరావు, కాంగ్రెస్ నాయకులు జి.గోపి ప్రజానాట్య మండలి నాయకులు బి.రామకృష్ణ, సిఐటియు నాయకులు ఎస్కె రఫి మాట్లాడారు. స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద సాయంత్రం 4 గంటలకు ప్రదర్శన ఉంటుందని, ప్రజలంతా పాల్గొనాలని కోరారు.

కబ్జాలు, అక్రమ రిజిస్ట్రేషన్లపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - చిలకలూరిపేట

కబ్జాలు చేయడమే కాకుండా వాటిని సరైనవని చూపించుకునేలా అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు. మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ విడుదల లక్ష్మీనారాయణ భాదితుల సంఘం సమావేశం స్థానిక వెంకటేశ్వర థియేటర్ ఎదురుగా ఉన్న భాస్కర్ సినీ ఫంక్షన్‌హాల్‌లో గురువారం నిర్వహించారు. సమావేశానికి అఖిల పక్ష పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు హాజరుకాగా సిపిఎం పట్టణ కార్యదర్శి పి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పసుమరులోని సర్వే నంబరు 16/1ఎ లో రెడ్ మార్కు ఉన్న భూమిని సర్వే నంబర్ మార్పు చేసి 16/ 1 వేసి దానిని రిజిస్ట్రేషన్ చేసిన అంశంలో సర్వేయర్లు, తహశీల్దారు, రిజిస్ట్రార్ కార్యాలయ ఉద్యోగులు అందరూ కలిసి అక్రమాలకు పాల్పడ్డారన్నారు. ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందనే ఉద్దేశంతో ఎస్సీలు సెంటు, రెండు సెంట్లు చొప్పున కొన్నారని, ఇప్పుడు వారు నష్టపోతున్నారని చెప్పారు. రహదారిని లక్ష్యంగా చేసుకుని అడ్డంగా గోడ కట్టడంతో భూములకు విలువ తగ్గి అక్కడ స్థలాలున్నవారు మానసిక క్షోభకు గురవుతున్నారని చెప్పారు. ఇప్పటికైనా స్థానిక ప్రజాప్రతినిధులు కలుగజేసుకుని సమస్యను పరిష్కరించాలని కోరారు. పలు పార్టీలు, సంఘాల

నాయకులు మాట్లాడుతూ 2005లో అప్పటి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ అక్కడున్న బ్రిడ్జి పడిపోవటంతో రహదారి కోసం వందల సంవత్సరాల నాటి డొంకనే తాత్కాలికంగా రహదారిగా చేసి మున్సిపాలిటీ నుంచి నిధులను మంజూరి చేయచి రహదారిగా వేయించారని, ఆ తరువాత మెటల్ రోడ్లు వేశారని తెలిపారు. అది రహదారి అని తెలిసి కొనుగోలు చేయటం తప్పు కాదా అని ప్రశ్నించారు. విడదల లక్ష్మీనారాయణ ఇప్పటికైనా తప్పు తెలుసుకోవాలని, అడ్డుగా కట్టిన గోడను తొలగించేయాలని కోరారు. లేకుంటే ఉద్యమం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు.

పదేపదే విన్నవించినా చిన్నచూపు చూస్తున్న ప్రభుత్వం

- ఉద్యోగుల నిరసనలో జెఎసి రాష్ట్ర అధ్యక్షులు బండి శ్రీనివాసరావు
- ఎన్నికల్లో ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉండాలని పిలుపు

నరసరావుపేటలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షులు బండి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని కోరుతూ గురువారం మధ్యాహ్న భోజన సమయంలో పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని కలెక్టరేట్‌కు సమీపంలో గల జిల్లా కార్మిక శాఖ కార్యాలయ ప్రాంగణంలో ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. జెఎసి రాష్ట్ర అధ్యక్షులు బండి శ్రీనివాసరావు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న సరెండర్ లీవులు, జిపిఎఫ్ఎ బకాయిలను తక్షణమే చెల్లించాలని, ఐఆర్ వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయాలని పెండింగ్ డిఎలు ఏరియర్ చెల్లించాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, కాంటాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు 12వ పీఆర్సీ, ఐఆర్ 30 శాతం అమలు చేయాలని కోరారు. ఉద్యోగులకు ప్రభుత్వం రూ.21 వేల కోట్ల బకాయి పడిందని అన్నారు. 58 నెలలుగా ఓర్పుతో ఎదురు చూశామని, బకాయిలు చెల్లించాలని ప్రభుత్వానికి అనేకమార్లు విన్నవించినా చర్చలు జరిపినా చిన్నచూపు చూస్తోందని విమర్శించారు. మొండిగా వ్యవహరిస్తున్న ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో బుద్ధి చెప్పేందుకు ఉద్యోగులు సిద్ధంగా ఉండాలన్నారు. సమస్యల పరిష్కారం కోసం రానున్న రోజుల్లో ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఎపి జెఎసి డిప్యూటీ సెక్రటరీ జనరల్ కె.వి శివారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా సిపిఎస్, జిపిఎస్ రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. ఉద్యోగుల ఆర్థిక స్థితిగతులు మేరకు ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను విడుదల చేయాలన్నారు. గుంటూరు జిల్లా చైర్మన్ గంటసాల శ్రీనివాసరావు, జిల్లా కన్వీనర్ శెట్టిపల్లి సతీష్‌కుమార్, నరసరావుపేట తాలూకా చైర్మన్ రామ కృష్ణ, కన్వీనర్ ఎం.ఆనంద్‌నాథ్, సిహెచ్. కోటిరెడ్డి, రవికుమార్, రామాంజనరెడ్డి, డివిడి ప్రసాద్, పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి ప్రభుదాస్ పాల్గొన్నారు.

అమరావతిలో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

ప్రజాశక్తి - అమరావతి

తహశీల్దార్ కార్యాలయం ప్రాంగణంలో భోజన విరామ సమయంలో ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఎన్‌జిఒ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులు సూరెపల్లి రాజశేఖర్ మాట్లాడారు. పి.సునీత, మురళీ, వెంకట్రావు, పరమేశం, వెంకటకృష్ణ పాల్గొన్నారు.

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - అచ్చంపేట

స్థానిక డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల, కళాశాలలో ఐదో తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరానికి ఇంగ్లీష్ మీడియం ప్రవేశానికి దరఖాస్తు చేసుకునేందుకు 2024-25 సంవత్సరానికి సంబంధించి ఈనెల 23వ తేదీ లోపు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ టి.అరుణ్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతిలో 80 సీట్లు ఉండగా వీటిల్లో ఎస్సీలకు-60 బీసీ-సీ -10 సీట్లు ఎస్టీలకు-5, బీసీలకు-4 ఓసికి-1 ఉన్నాయని వివరించారు. ఇంటర్మీడియట్ ఎంపీసీ-40, బైపిసి-40 సీట్లు ఉండగా వీటికీ పైన తెలిపిన విధంగా రిజర్వేషన్లు అమలు చేస్తామని తెలిపారు. ఐదవ తరగతికి దరఖాస్తు చేసుకునేవారు నాలుగో తరగతి పూర్తి చేసి ఉండాలని, ఇంటర్మీడియట్‌కు దరఖాస్తు చేసుకునేవారు పదో తరగతి చదివి ఉండాలని తెలిపారు. పల్నాడు గుంటూరు, బాపట్ల, జిల్లాలకు చెందిన వారు ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చని, మార్చి 10వ తేదీన ప్రవేశ పరీక్ష ఉంటుందని, ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోలేని వారు నేరుగా కళాశాలకు వచ్చి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

విలేకరిపై దాడి చేసిన వారిని శిక్షించాలి

ప్రజాశక్తి - వినుకొండ : నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకాలను బహిర్గతం చేస్తున్న అమరావతి ఈనాడు విలేకరి పరమేశ్వరరావుపై దాడులను ఖండిస్తూ గురువారం వినుకొండ నియోజకవర్గ జర్నలిస్టుల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. స్థానిక శివయ్య స్తూపం సెంటర్ నుండి తహశీల్దార్ కార్యాలయం వదరకు ప్రదర్శన చేశారు. తహశీల్దార్ బ్రహ్మయ్యకు వినతిపత్రం అందజేశారు. ఏపీయూడబ్ల్యూజేఎఫ్ నాయకులు టి.శ్రీనివాస రావు, ఏపీయూడబ్ల్యూజే నాయకులు వై.రామ్మోహన్‌రావు మాట్లాడారు. ఇసుక మాఫియా, వైసిపి దుండగుల చర్యలు అత్యంత దుర్మార్గమని వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులు వై.ఆజాద్, ఎల్.వెంకట్రావు, పి.సోమశేఖర్, గౌస్ మొహిద్దిన్, ఎం.మల్లికార్జునరావు, ఎన్.మహేష్, ఎ.మల్లికార్జునరావు, ఎం.రాంబాబు, అజయ్, మహేష్, పి.దుర్గా, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పెదకూరపాడు : విలేకరి పరమేశ్వరరావుపై దాడిని పెదకూరపాడు మండల వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు తహశీల్దార్ జి.ప్రభాకర్‌రావుకు వినతిపత్రం అందించారు. నాయకులు మాట్లాడుతూ వైసిపి పాలనలో జర్నలిస్టులపై దాడులు పెరిగాయని ఆందోళన వెలిబుచ్చారు. పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగించిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని కోరారు. జర్నలిస్టుల రక్షణ కోసం ప్రత్యేక చట్టం తేవాలన్నారు. డి.విజయ్ బెన్ని బాబు, ఎం.శ్రీనివాసరావు, బి.హనుమయ్య, పి.రాజు, సిహెచ్.బాజీ, బి.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ముగిసిన ఎన్ఎస్ఎస్ సేవా శిబిరం

ప్రజాశక్తి-విజయపురిసౌత్ : ఎపిఆర్‌డిసి కాలేజీలో ఈ నెల 9వ తారీఖున ప్రారంభమైన ఎన్ఎస్ఎస్ సేవా శిబిరం గురువారం ముగిసింది. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వై.ఎన్.ఎస్.చౌదరి మాట్లాడి వాలంటీర్లను అభినందించారు. వ్యాసరచన, చిత్రలేఖన, నాటక ప్రదర్శన, క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. ఎంపిపి పాఠశాల హెచ్ఎం పి.లక్ష్మిదేవి, శాంతారావు అంగన్వాడీ టీచర్ సఫీన బేగం, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎఎం మాషా పాల్గొన్నారు.

మోడి ప్రభుత్వ విధానాలపై తిరుగుబాటు

నేడు గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మె జయప్రదం చేయాలని నాయకుల పిలుపు

ప్రజాశక్తి, తాడేపల్లి రూరల్

సంయుక్త కిసాన్ యువమోర్చా, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నేడు జరుగు గ్రామీణ బంద్ ను జయప్రదం చేయాలని, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకరరావు అన్నారు. ఎం టీ ఎం సీ పరిధిలోని వడ్డేశ్వరం, కొలనుకొండ గ్రామాలలో రైతు, కార్మికులతో కలిసి విస్తృత ప్రచారాన్ని గురువారం ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా శివశంకరరావు మాట్లాడుతూ నరేంద్ర మోడీ ప్రభుత్వం కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత రైతాంగ వ్యతిరేక చట్టాలను తీసుకువచ్చిందని, వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసేందుకు నరేంద్ర మోడీ కార్పొరేట్ వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు మూడు నల్ల చట్టాలు తీసుకువచ్చారని ఆయన విమర్శించారు. అంతేకాకుండా వ్యవసాయ మోటార్లకు, విద్యుత్ మీటర్లు పెట్టేందుకు మతోన్మాద బిజెపి ప్రభుత్వం పూనుకుందని ఆయన విమర్శించారు. ఒకవైపున ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ, కార్పొరేట్ శక్తులకు దేశ సంపదను దోచుపెట్టే విధంగా నరేంద్ర మోడీ పరిపాలన సాగిస్తున్నారన్నారు. పండించిన పంటలకు మద్దతు ధర కల్పించకుండా రైతులను నట్టేట ముంచారని, కేంద్ర బిజెపి, నరేంద్ర మోడీ విధానాలను ప్రజలందరూ వ్యతిరేకించాలన్నారు. తక్షణమే రైతుల పండించిన పంటలకు సీ టు ప్లస్ 50 శాతం మద్దతు ధరలను పార్లమెంట్లో ఆమోదింప చేయాలని, నాలుగు లేబర్ కొడ్ లను ఎత్తివేయాలని, కనీస వేతనం 26 వేలు చొప్పున ఇవ్వాలని రవాణా రంగాన్ని నిర్వీర్యం చేసే, వాహన చట్టాన్ని ఎత్తివేయాలని తదితర డిమాండ్లతో శుక్రవారం జరుగు గ్రామీణ బందును జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం తాడేపల్లి మండల నాయకులు దొంతి రెడ్డి వెంకటరెడ్డి, కాట్రగడ్డ శివరామకృష్ణయ్య, కాట్రగడ్డ శివన్నారాయణ, కొడవటి రమేష్, శ్రీను తదితర కార్మికులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తాడేపల్లి : శుక్రవారం జరగనున్న నిరసన ప్రదర్శనను జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్నా శివశంకరరావు కోరారు. పెనుమాకలో గురువారం జరిగిన జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. బిజెపి ప్రభుత్వ వ్యతిరేక విధానాలకు రైతులు జరుపుతున్న నిరసనలను కూడా సహించలేకపో తుందన్నారు. గతంలో ప్రభుత్వం తమకిచ్చిన డిమాండ్లు అమలు చేయాలని డిల్లీకి వెళ్తున్న రైతులపై భాష్పవాయువు ప్రయోగించడం దుర్మార్గమైన చర్య అన్నారు. కార్మిక, రైతు వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న బిజెపి ప్రజా క్షేత్రంలో తగిన మూల్యం చెల్లించుకుంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్కె పీరూసాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-పెదనందిపాడు రూరల్

కేంద్ర ప్రభుత్వ రైతాంగ, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా జరిగే గ్రామీణ బంద్ లో భాగంగా పెదనందిపాడు పాత బస్టాండ్ సెంటర్లో శుక్రవారం ఉదయం 10 గంటలకు జరిగే నిరసన కార్యక్రమంలో ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కొత్త వెంకటశివరావు పిలుపునిచ్చారు. గురువారం పెదనందిపాడు, నాగుల పాడు, వరగాని, పాలపర్రు, కొమ్మూరు గ్రామాలలో కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షులు ముద్దన వెంకటేశ్వర్లు, సిఐటియు నాయకులు దొప్పలపూడి రమేష్ బాబు, కౌలు రైతు సంఘం నాయకులు చుక్కా యానాదులు, దేవరకొండ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి దుగ్గిరాల : శుక్రవారం గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మె జయప్రదం చేయాలని గురువారం మండలంలోని తుమ్మపూడి గ్రామంలో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ బందులో రవాణా రంగానికి చెందిన కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జెట్టి బాలరాజు వై శీను కె శ్రీను సిహెచ్ వందనం ఎస్కే రఫీ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-మంగళగిరి రూరల్

ఈనెల 16వ తేదీ జరిగే గ్రామీణ భారత్ బంద్ జయప్రదం చేయాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో చిన కాకాని లో గురువారం విస్తృత ప్రచారం నిర్వహించారు. బ్యాంకులు ప్రభుత్వ కార్యాలయాలు ఇతర అధికారులకు సమ్మె నోటీసులను అందజేశారు. ఈ సందర్భంగా వ్యకాస జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వాలని, ఉపాధి హామీ పథకం 200 రోజులు పొడిగించాలని ఉపాధి హామీ కార్మికులకు రూ.700 కూలి ఇవ్వాలని, గతంలో ఢిల్లీలో రైతుల ఆందోళన చేసినప్పుడు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని రైతులను అన్ని విధాల ప్రభుత్వం ఆదుకోవాలని, జీవో నెంబర్ 106వల్ల కార్మికులు రాబోయే కాలంలో జైలకే పరిమితం అయ్యే పరిస్థితులు రాబోతున్నమని ఏ ఉపాధి లేక స్వయం ఉపాధి పొందుతూ జీవనం సాగిస్తుంటే వారి పొట్ట కొట్టే విధంగా కేంద్ర ప్రభుత్వం రవాణా కార్మికుల కు ఉరితాడు లా ఉండే జీవోను రద్దు చేయాలని ఈనెల 16వ తేదీ భారత గ్రామీణ బంద్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ బందులో ప్రజలు, కార్మికులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ప్రజాశక్తి - తాడికొండ

సంయుక్త కిసాన్ మోర్చా కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో తలపెట్టిన గ్రామీణ బంద్ పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్ కుమార్ అన్నారు. గురువారం తాడికొండ తాసిల్దార్ కార్యాలయంలో ఉప తాసిల్దార్ ప్రసాద్ ను కలిసి ఈ మేరకు సమ్మె నోటీసులు అందజేశారు ఈ గ్రామీణ బందుకు సంపూర్ణ మద్దతు తెలపవలసిందిగా ఉప తాసిల్దార్ ను కోరారు. అనంతరం ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులలో నోటీసులను అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షులు కనగాల పూర్ణచంద్రరావు చింతల భాస్కరరావు బాణావత్ భద్రయ్య పాల్గొన్నారు.

చినకాకానిలో సమ్మె నోటీసు అందజేస్తున్న ఈమని అప్పారావు తదితరులు

తాడికొండలో సమ్మె నోటీసు అందజేస్తున్న కె అజయ్‌కుమార్ తదితరులు

పెదనందిపాడులో ప్రచారం

పెనుమాకలో

దుగ్గిరాలలో

రాజధాని ఫైల్స్ అడ్డుకోవడం తగదు

టిడిపి గుంటూరు పశ్చిమ నియోజకవర్గ నాయకులు మన్నవ మోహనకృష్ణ

మంగళగిరి థియేటర్ వద్ద ప్రేక్షకుల నిరసన - తాడేపల్లిలో రాస్తారోకో

ప్రజాశక్తి - గుంటూరు : రాజధాని అమరావతి రైతుల కష్టాలు, కన్నీటి గాథలపై రూపొందిన 'రాజధాని ఫైల్స్' చిత్ర ప్రదర్శనను అడ్డుకోవడం దుర్మార్గమని టిడిపి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ నేత మన్నవ మోహనకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం గుంటూరులోని తన కార్యాలయంలో గురువారం విలేర్లతో మాటా డారు. అమరావతి రాజధాని కోసం భూములిచ్చిన రైతాంగ సంఘర్షణ, వాళ్ల కన్నీటి వ్యథల ఆధారంగా రూపొందించిన చిత్రం రాజధాని ఫైల్స్ అని, ఈ సినిమాలో ఇబ్బందకరమైన సన్నివేశాలు లేవని సెన్సార్ బోర్డు సైతం అనుమతులిచ్చినా వైసిపి నాయకులు కోర్టుకెళ్లి విడుదలపై స్టే తీసుకురావడం దుర్మార్గమని అన్నారు. సామాజిక బాధ్యతతో వాస్తవాలను సినిమాగా తీస్తే తప్పెలా అవుతుందని ప్రశ్నించారు. నాడు విపక్షంలో అమరావతి రాజధాని ఏర్పాటును స్వాగతించిన జగన్మోహన్‌రెడ్డి, వైసిపి నేతలు అధికారంలోకి వచ్చాక మూడు రాజధానుల పేరుతో డ్రామాలు ఆడింది నిజం కాదా? అని ప్రశ్నించారు. నిన్నటి వరకూ మూడు రాజధానులని, ఇప్పుడు ఉమ్మడి రాజధాని అంటున్నారని ఎద్దేవ చేశారు. ఐదేళ్ల పాలనా వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు ఈ చిత్రాన్ని అడ్డుకుంటున్నారని, మూడు గంటల సినిమా చూసి భయపడుతున్నారంటే సినిమా యదార్ధ సంఘటనల ఆధారంగా తెరకెక్కడమే కారణమని అన్నారు. **ప్రజాశక్తి - మంగళగిరి :**రాజధాని ఫైల్స్ సినిమా హైకోర్టు స్టే విధించడంతో సినిమాను నిలిపివశారు. గురువారం మంగళగిరి గౌతమ్ బుద్ధ రోడ్డుపై థియేటర్ ఎదురుగా నిరసన తెలిపారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.**ప్రజాశక్తి-తాడేపల్లి :** రాజధాని సినిమా ఫైల్స్ సినిమా ప్రదర్శనను గురువారం ఉండవల్లి సెంటర్ రామకృష్ణ థియేటర్‌లో అర్ధాంతరంగా నిలిపివేశారు. టికెట్లు ముందుగానే బుక్ చేసుకున్న వారు థియేటర్‌లోకి వెళ్లారు. టైటిల్స్ అయిపోగానే హైకోర్టు ఇచ్చిన తీర్పును రెవెన్యూ అధికారులు థియేటర్ యజమానులకు అందజేశారు. దీంతో వెంటనే సినిమా ప్రదర్శనను నిలిపివేశారు. దీంతో ప్రేక్షకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉండవల్లి సెంటర్ రోడ్డు మీదకు వచ్చి రాస్తారోకో చేశారు. రాజధానికి చెందిన వారు అక్కడకు చేరుకుని అసంతృప్తి వ్యక్తం చేయడంతో పాటు రోడ్డుపై ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ భావ ప్రకటన స్వేచ్ఛతో పాటు ప్రభుత్వం సినిమాలు కూడా నిలుపుదల చేయడం సరికాదన్నారు. తాడేపల్లి సిఐ మధుసూదనరావు తన సిబ్బందితో ఆ ప్రాంతానికి చేరుకుని రైతులకు, ప్రేక్షకులకు నచ్చజెప్పి రాస్తారోకో విరమింపజేశారు.

తాడేపల్లిలో రాస్తారోకో

వైద్య సేవలను పరిశీలిస్తున్న ప్రపంచ బ్యాంక్ బృందం సభ్యులు

జిజిహెచ్‌లో డబ్ల్యూహెచ్ఓ బృందం పర్యటన

ప్రజాశక్తి తెనాలి

ప్రభుత్వ సహకారంతో జిల్లా వైద్యశాలలో మరింత మెరుగైన సేవలు అందించే దిశగా కృషి చేసేందుకు ప్రపంచ బ్యాంకు బృందం పర్యటన జరుగుతుందని సూపరిండెంట్ డాక్టర్ సౌభాగ్య వాణి చెప్పారు. ప్రపంచ బ్యాంకు ప్రతినిధి బృందం గురువారం తెనాలి జిల్లా వైద్యశాలను పరిశీలించింది. తొలుత ఢిల్లీ నుంచి వచ్చిన వారు వైద్యశాల సూపరింటెండెంట్‌ను కలిశారు. ఆమె ద్వారా వైద్యశాలలో అందుబాటులో ఉన్న విభాగాలు, వైద్యుల లభ్యత, రోగులకు అందుతున్న సేవలను తెలుసుకున్నారు. అనంతరం జిల్లా వైద్యశాలలోని తల్లి పిల్లల వైద్యశాలను పరి శీలించారు. వైద్యశాలను బలోపేతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా డాక్టర్ సౌభాగ్య వాణి మాట్లాడుతూ వైద్యశాలలో అన్ని విభాగాలను పరిశీలించి, వివరాలను సేకరించి బృంద సభ్యులు నివేదికను తయారుచేసి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తారన్నారు. ప్రభుత్వ సహకారంతో భవిష్యత్‌లో వైద్యశాలలను మరింత బలోపేతం చేసే అవకాశముందని, హిందూపూర్, పార్వతీపురం, తెనాలి వైద్యశాలలను ఈ బృందం పరిశీలిస్తుందన్నారు. వారి వెంట ఏవో డాక్టర్ ఎం.మజీదా బేగం, ఆర్‌ఎంవోలు షేక్ మస్తాన్‌వలి, కె.సురేష్, వైద్యులు డాక్టర్ రమణారావు, డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ వినీల్, నర్సింగ్ సూపరింటెండెంట్ కె.రాజేశ్వరి ఉన్నారు.

సిఎస్‌ఎఫ్ సంస్థ ఎదుట నిరసన తెలియజేస్తున్న ఉద్యోగులు

సిఎన్‌ఎఫ్ పథకం ఉద్యోగుల జీతాలు చెల్లించాలి

ప్రజాశక్తి-గుంటూరు : ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్ పథకంలో పనిచేస్తున్న ఉద్యోగుల 12 నెలల జీతాలు చెల్లించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై నేతాజీ డిమాండ్ చేశారు. గోరంట్ల సమీపంలో ఉన్న రైతు సాధికార సంస్థ రాష్ట్ర కార్యాలయం ఎదుట జరిగిన నిరసన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. రాష్ట్రవ్యాప్తంగా వేలాదిమంది వివిధ స్థాయిలలో పనిచేసే ఉద్యోగులు తమ విధులు నిర్వర్తించేందుకు రోజువారీ ప్రయాణ ఖర్చుల కోసం తమ సొంత డబ్బు ఖర్చు చేయాల్సి వస్తున్నదన్నారు. వీరికి గత ఏడాదికాలంగా జీతాలు రాకపోగా, వీరు ప్రతిరోజు విధి నిర్వహణలో భాగంగా ప్రయాణ ఖర్చులకోసం, అలాగే రాష్ట్ర అది కారుల పర్యటనలు, దేశ, విదేశీ పర్యాటకుల సందర్శనల సందర్భ ంగా వీరంతా వేలాది రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తుందని తెలిపారు. పర్యవసానంగా ఈ పథకంలో పనిచేసే ఉద్యోగులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అప్పుల పాలు కావాల్సి వస్తుందన్నారు. జీతం ఇవ్వమని అధికారులను అడుగు తుంటే స్పందించకపోగా, ఉద్యోగం మానేయండని అధికారులు ఒత్తిడి చేస్తున్నారని, ఇది సరైంది కాదన్నారు. తక్షణమే బకాయి జీతాలు చెల్లించకపోతే రాష్ట్రవ్యాప్త ఆందోళనకు పూనుకోవాల్సి వస్తుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. నిరసన కార్యక్రమం అనంతరం సంస్థ సీఈవో బి.రామారావుకు వినతిపత్రం అందించారు. రెండు వారాల్లో బకాయి జీతాలు చెల్లింపునకు తగు చర్యలు చేపడతామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆ పథకం ఉద్యోగులు కె.అంకినీడుప్రసాద్, ఏ.వి.పాండురంగారావు, సిహెచ్. వర ప్రసాద్, వి రజిని, ఎస్.కె.మస్తాన్‌బి, ఎన్.అనిత, సిహెచ్.ప్రణీత పాల్గొన్నారు.

చంద్రబాబు ఇంటి వద్ద కోలాహలం

ప్రజాశక్తి-తాడేపల్లి

అమరావతి కరకట్టపై గల చంద్రబాబు ఇంటి వద్ద గురువారం కోలాహలం చోటుచేసుకుంది. టిడిపిలో చేరేందుకు సత్యసాయి జిల్లా కదిరిగుంట, ఏలూరు జిల్లా చింతపూడి, నరసరావుపేట, సుళ్లూరుపేట నుంచి పెద్దఎత్తున ప్రజలు తరలిరావడంతో ఆ ప్రాంతమంతా సందడి నెలకొంది.

నేటి గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయండి

కౌలు రైతు సంఘం

ప్రజాశక్తి-సత్తెనపల్లి

కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక, వినాశకర విధానాలకు నిరసనగా సంయుక్త కిసాన్ మోర్చా-కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఈ నెల 16న జరిగే గ్రామీణ బంద్-పారిశ్రామిక సమ్మెలో కార్మికులు, కర్షకులు వ్యవసాయ కార్మికులు, అసంఘటిత రంగ కార్మికులు, స్కీం వర్కర్లు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కౌలు రైతు సంఘం సత్తెనపల్లి మండల కార్యదర్శి పెండ్యాల మహేష్ గురువారం ఒక ప్రకటనలో పిలుపు నిచ్చారు. కేంద్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తుందని అన్నారు. మన రాష్ట్రానికి మరింత ద్రోహం చేసిందని అన్నారు. ప్రత్యేక హోదా నిరా కరించిందని, వెనుకబడిన రాయలసీమ,ఉత్తరాంధ్ర జిల్లాలకు ఇవ్వాల్సిన ప్రత్యేక ప్యాకేజీ అమలు చేయడం లేదని అన్నారు. జాతీయ ప్రాజెక్టు అయిన పోలవరం నిర్వాసితుల నష్ట పరిహారం, పునరావాసం తనకు సంబంధం లేదంటుందని అన్నారు. రైల్వే జోన్ ఎగనామం పెట్టిందని, కడప ఉక్కు ఫ్యాక్టరీ ఇవ్వకపోగా తెలుగు ప్రజలు పోరాడి సాధించుకున్న విశాఖ ఉక్కును అమ్మకానికి పెట్టిందని అన్నారు.రాజధాని నిర్మాణానికి పట్టెడు మట్టితో సరిపెట్టిందని అన్నారు. కృష్ణా జలాల పంపిణీలో రాష్ట్రానికి ద్రోహం పెట్టిందని అన్నారు. ఈ నేపథ్యంలో సంయుక్త కిసాన్ మోర్చా-కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఈ బంద్ కు పిలువడం జరిగిందని అన్నారు. బంద్ లో కార్మికులు, కర్షకులు, వ్యవసాయ కూలీలు, అసంఘటిత రంగ కార్మికులు, స్కీం వర్కర్లు అందరూ పాల్గొని కేంద్ర ప్రభుత్వ వినాశకార విధానాలపై తమ నిరసన వ్యక్తం చేయాలని ఆ ప్రకటనలో కోరారు.

ఘనంగా పిన్నెల్లి పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - మాచర్ల

ప్రభుత్వ విప్ మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పుట్టినరోజు వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. పలు వార్డులలో ఆయన అభిమానులు పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. వేడుకలకు నరసరావుపేట పార్లమెంట్ అభ్యర్థి అనిల్ కుమార్ యాదవ్ హాజరై ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో జరిగిన వేడుకలలో రామకృష్ణారెడ్డిని, అనిల్ కుమార్ యాదవ్‌ని, వెంకట్రామిరెడ్డిని భారీ గజమాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు ఆయా కార్యక్రమాలలో మున్సిపల్ చైర్మన్ చిన్న ఏసోబు, ఎంపీపీ బూడిద శ్రీను, మార్కెట్ యార్డ్ చైర్మన్ టి.వెంకటేశ్వర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ టి.కిషోర్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో ఇసుక దొంగలు: ప్రత్తిపాటి పుల్లారావు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

రాష్ట్రంలో వైకాపా ఇసుకదొంగలు రోజు రోజుకీ మరీ బరితెగిస్తు న్నారని మాజీమంత్రి, తెలుగుదేశం పార్టీ రా ష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. స్థానిక పండరీపురంలోని తన నివాసంలో విలేకరుల సమావేశంలో గురువారం ఆయన మాట్లాడుతూ ఇసుక అక్రమాలు నిజం, అడ్డగోలు తవ్వ కాలు వాస్తవం అని స్వయంగా కేంద్ర ప్రభుత్వమే హైకోర్టుకు తెలిపిందంటే రాష్ట్ర మొత్తం మీద పరిస్థితి ఏ స్థాయికి చేరిందో అర్థం చేసుకోవచ్చన్నారు. వేలకోట్ల రూపాయల ఇసుక సంపదను దోచేస్తున్నా ఇన్నాళ్లు ఎక్కడా తప్పే జరగలేదు అన్నట్లు మాట్లాడు తున్న జగన్ ప్రభుత్వ పెద్దలు, వైసిపి ప్రతినిధులు, నాయకులకు ఈ పరిణామాలు చెంపపెట్టు అన్నారు.

నాల్గో విడత జమయ్యేదెప్పుడో?

- 'ఆసరా' బటన్ నొక్కి మూడు వారాలకు పైమాటే
- లబ్ధిదారుల ఎదురుచూపులు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

ఆసరా పథకం నాల్గో విడత సాయం నేటికీ అందలేదని, ఇంకా తమ ఖాతాల్లో జమ కాలేదని డ్వాక్రా మహిళలు వాపోతున్నారు. మొదటి విడత మిన హాయిస్తే, రెండో, మూడో విడతలు కూడా నెలల తరబడి ఆలస్యమయ్యాయని, నాల్గో విడత కూడా ఇంత వరకు అంద లేదని విమర్శిస్తున్నారు. గత నెల 23వ తేదీన అనంతపురం జిల్లా ఉరవకొండలో జరిగిన మహాసభలో ఆన్‌లైన్ సిస్టంలో ముఖ్యమంత్రి జగన్ ఆసరా 'బటన్' నొక్కారు. ఒక్క చిలకలూరిపేట మండలంలో 1323 డ్వాక్రా సంఘాలు ఉన్నాయి. వారికి గాను రూ.10,16,67,255 కోట్ల డబ్బు లు జమ కావాల్సి ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. అప్పటి నుంచి దాదాపు 25 రోజుల వరకు ఏ గ్రూపులోని సభ్యులకు ఈ డబ్బులు జమకాలేదు. పట ణంలో మొత్తం 38 వార్డులు ఉన్నాయి. మంగళ, బుధ వారాల్లో 27వ వార్డులో, ఇంకొన్ని వార్డుల్లోని ఒకటి రెండు గ్రూపులకు ఈ పథకం నిధులు జమ య్యాయి. ఇంకా మిగిలిన గ్రూపుల పరిస్థితి ఏంటని మిగిలిన లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. ఇంకా నగదు జమ కాలేదని లబ్ధిదారులు అడుగుతుంటే 'ఊరికే వచ్చే డబ్బులే కదా.. అంత తొందరెందుకు' అనే సమాధానం సంబంధిత అధికారులు చెబుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇంకా అధికార పార్టీ సభలకు హాజరు కాకపోతే తమకు అందుతున్న పథకాలు రద్దు చేస్తామని, వచ్చే డబ్బులు ఆపేస్తామని బెదిరిస్తున్నారని పట్టణ డ్వాక్రా మహిళలు చెబుతున్నారు. నాల్గో విడత డబ్బులు జమ చేయాలని కోరుతున్నారు.

ఇంజనీరింగ్ కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయండి

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

మున్సిపల్ కార్మికుల 16 రోజుల సమ్మె సందర్భంగా ఇంజనీరింగ్ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే జీవోలు ఇచ్చి అమలు చేయాలని కోరుతూ పిడుగురాళ్ల మున్సిపల్ కమిషనర్ బి.ఎస్. గిరికుమార్‌కు సిఐటియు ఆధ్వర్యంలో గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి టి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని స్కిల్డ్, సెమి స్కిల్డ్ నైపుణ్యం ప్రకారం వేతనాలు పెంచాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, పే స్కేల్ ప్రకారం వేత నాలివ్వాలని కోరారు. ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. వీటిపై సత్వరమే చర్యలు తీసుకోకుంటే దశల వారీగా ఆందోళన చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ కార్మికులు కె.రాజు, బ్రహ్మయ్య, శ్రీను, రమేష్, ప్రతాప్, షలార్, వెంకయ్య, విజయ్ కుమార్, మోహన్‌రావు పాల్గొన్నారు.

పిడుగురాళ్ల మున్సిపల్ కమిషనర్ బి.ఎస్. గిరికుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్

ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. సిఐటియు పట్టణ కార్యదర్శి ఎం.హరిపోతురాజు మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులకు రూ.21 వేలు, డ్రైవర్లకు రూ.24,500 ఇవ్వడానికి ప్రభుత్వం అంగీకరించిందని, ఈ మేరకు జీవో విడుదల చేయాలని కోరారు. సమ్మెకాలపు వేతనాలివ్వాలని, సంక్రాతి కానుక రూ.వెయ్యి ఇవ్వాలని కోరారు. మృతి చెందిన కార్మికుల కుటుంబాలలో ఒకరికి ఉద్యోగం ఇవ్వా లని, పిఎఫ్ ఖాతాల వివరాలు తెలపాలని, కార్మికులకు రక్షణ పరికరాలు అందించాలని డిమాండ్ చేశారు.ఈ మేరకు వినతిపత్రాన్ని మున్సిపల్ కమిషనర్ కె.షమ్మీకి అందించారు. నాయకులు రాజకుమార్, చంద్రకళ, దుర్గా, జయమ్మ, లూదియమ్మ, శ్రీను, వి.శ్రీను, అచ్చమ్మ, రోశమ్మ, వెంకాయమ్మ పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్ కె.షమ్మీకి వినతిపత్రం అందిస్తున్న మున్సిపల్ కార్మికులు

నరసరావుపేట మార్కెట్ యార్డు చైర్మన్‌గా వాసుదేవారెడ్డి

- డైరెక్టర్లుగా మరో 15 మంది నియామకం
- ప్రభుత్వ ఉత్తర్వులు జారీ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్‌గా శనివారపు వాసుదేవారెడ్డి నియమితులయ్యారు. కొద్ది నెలల క్రితం అప్పటి మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ ఎస్.ఎ హనీఫ్ తన పదవీకాలం ముగియనున్న దశలో ఎమ్మెల్యే తీరును నిరసిస్తూ రాజీనామా చేశారు. ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా ఉన్న సీనియర్ నాయకులు గజ్జల బ్రహ్మారెడ్డికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలో కొద్ది నెలలుగా ఖాళీగా ఉన్న మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ పదవి విషయమై ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి సూచన మేరకు నరసరావుపేట మండలంలోని ఉప్పలపాడుకు చెందిన వాసుదేవారెడ్డిని నియమిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వైస్ చైర్‌పర్సన్ పులుసు అన్నపూర్ణమ్మ కోటేశ్వరరావు, డైరెక్టర్లుగా పి.రామయ్య, నక్కా వెంకట కోటేశ్వరరావు, బత్తుల పద్మలత రవివర్మ, షేక్ బిబి ఆశా, కుంభ శ్రీనివాసరావు, పెనుగొండ ప్రభాకర్, తడికమళ్ల చిన్న కోటేశ్వరరావు, బి.రామ నాగేశ్వరరావు నియమితులయ్యారు. వాసుదేవారెడ్డి వైసిపి ఆవిర్భావం నుండి ఎమ్మెల్యే శ్రీనివాసరెడ్డికి అనుచరునిగా ఉంటున్నారు. నూతన చైర్మన్, వైస్‌చైర్‌పర్సన్, కమిటీ సభ్యులు ఎమ్మెల్యే శ్రీనివాసరెడ్డిని గురువారం ఆయన కార్యాలయం మర్యాదపూర్వకంగా కలిశారు. వారికి ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. మార్కెట్ యార్డ్ ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని చెప్పారు. వాసుదేవారెడ్డి మాట్లాడుతూ తనపట్ల నమ్మకంతో చైర్మన్ పదవిని కేటాయించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో ప్రమాణస్వీకారం చేస్తామన్నారు.

వాసుదేవారెడ్డికి నియామకపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

సేవాలాల్ మహరాజ్ ఆలయ అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-విజయపురిసౌత్

సేవాలాల్ మహరాజ్ 285 వ జయంతి వేడుకలను పురస్కరించుకుని విజయపురిసౌత్ లోని బయ్యారం సమీపంలోని శ్రీ సంత్ సేవలాల్ మహరాజ్ ఆలయాన్ని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ గురువారం సందర్శించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ సేవలాల్ ఆలయ అభివృద్ధి కోసం కృషి చేస్తానని చెప్పారు.సేవాలాల్ మహరాజ్ జయంతి సందర్భంగా శనివారం నిర్వహించే ఉచిత వైద్య శిబిరాన్ని పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ఆలయ ధర్మకర్త కె.పాండు నాయక్ ఆధ్వర్యంలో కలెక్టర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో తహశీల్దార్ మంజునాధరెడ్డి, మాచర్ల జడ్పీటీసీ మల్లు స్వామి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయిమార్కొండారెడ్డి, కెపిగూడెం సర్పంచ్ పాండు నాయక్ పాల్గొన్నారు.

గిరిజన సంఘాల ఐక్యవేదిక నివాళి

ప్రజాశక్తి - చిలకలూరిపేట



ఏపీ గిరిజన సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు బి.శీను నాయ క్ ఆధ్వర్యంలో సేవలాల్ చిత్ర పటా నికి బిసి,ఎస్.సి.ఎస్టీ నాయ కులు పూల మాలలు వేసి నివాళులర్పిం చారు. స్థానిక ఎన్ఆర్‌టి సెంట ర్‌లో అన్నదాన కార్యక్రమం నిర్వహిం చారు. కార్యక్రమంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ జాయ బి.సి సంక్షేమ సంఘం మాజీ ఉపాధ్యక్షులు ఎం. వెంకట కోటయ్య, రాష్ట్ర కార్మిక, రైతాంగ పరి రక్షణ సమితి సింగు లెనిన్ బాబు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం గౌరవ సలహా దారులు కె.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి 7
గుంటూరు జిల్లా
శుక్రవారం 16 ఫిబ్రవరి 2024

నల్లబ్యాడ్జీలతో ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి-గుంటూరు
ఏపీ జేఏసీ పిలుపు మేరకు ఉద్యోగుల ఉద్యమ కార్యాచరణలో భాగంగా గురువారం రెండో రోజూ వరుసుగా నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరయ్యారు. అలాగే మధ్యాహ్న భోజన విరామ సమయంలో కలెక్టరేట్ ప్రాంగణంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయితీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ కూచిపూడి మోహనరావు, జిల్లా అధ్యక్షులు పూర్ణచంద్రారెడ్డి, ఏపీ ఎన్జీవో జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి ఎం ఎం మూర్తి, సంయుక్త కార్యదర్శి ఏ శ్యాంసుందర్, కూరాకుల శ్రీనివాసరావు, మహిళా సంయుక్త కార్యదర్శి కె.శివజ్యోతి తదితరులు ప్రసంగించారు. గత పిఆర్‌సిలో ప్రభుత్వం ఉద్యోగుల డిమాండ్లు నెరవేర్చకపోగా, ఉన్న హక్కులు కొనసాగించాలని కోరే పరిస్థితికి తీసుకొచ్చిందని వాపోయారు. వేతనాలు సకాలంలో చెల్లించట్లేదని, పెద్ద ఎత్తున బకాయిలు పేరుకుపోయాయన్నారు. ఉద్యోగులకు చెల్లించాల్సిన రూ.21 వేల కోట్ల బకాయిలను తక్షణం చెల్లించాలని, కాంట్రాక్టు ఉద్యోగుల సేవలను

తెనాలిలో పురపాలక సంఘం వద్ద ఆందోళనలో ఉద్యోగులు

గుంటూరు కలెక్టరేట్ వద్ద నిరసన తెలియజేస్తున్న ఉద్యోగులు

క్రమబద్ధీకరించాలని, 2012 పిఆర్‌సికి సంబంధించి తాత్కాలిక భతి 30శాతం మంజూరు చేయాలని, పెన్షనర్లకు అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్ పాత పద్ధతి ప్రకారం మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో ఎపిఎన్‌జిఒ గుంటూరు నగర అధ్యక్షులు సూరి, కార్యదర్శి సిహెచ్.కళ్యాణ్‌కుమార్, విజయ్, మహిళా విభాగం జిల్లా చైర్ పర్సన్ ఎం.రాధారాణి, కమర్షియల్ టాక్స్ ఉద్యోగుల అధ్యక్షులు సయ్యద్ జానీభాష పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తెనాలి :ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలను ఎన్నికల్లోగా చెల్లించాలని ఆంధ్రాప్యారిస్ మున్సిపల్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక పురపాలక సంఘ కార్యాలయం వద్ద పురపాలక సంఘ ఉధ్యోగులు గురువారం భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఉద్యోగవర్గాలపై ప్రభుత్వం నిర్లక్ష్యదోరణిని విడనాడాలని, లేని పక్షంలో శుక్రవారం కూడా నిరసన వ్యక్తం చేస్తామని, 17న చినరావూరు పార్కువద్ద ధర్నా, 20న కలక్టరేట్ల వద్ద ధర్నా నిర్వహించి, 27న ఛలో విజయవాడకు ఉద్యోగులు తమ కుటుంబ సభ్యులతో సహా హాజరౌతారని హెచ్చరిం చారు. కార్యక్రమంలో ఎంహెచ్‌వో డాక్టర్ కె.హెలెన్‌నిర్మల, ఆర్వో సోమశేఖరయాదవ్, వివిధ విభాగాల ఉద్యోగులు పాల్గొన్నారు.

రేడియాలజీ విభాగంలో సిటీస్కాన్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి
ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు సూఎరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ చెప్పారు. గురువారం ఆసుపత్రి రేడియాలజీ విభాగం లో సిటీ స్కాన్ పరికరం ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. డాక్టర్ కిరణ్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ ఆసుపత్రి అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం మరమ్మతుల బడ్జెట్ కింద రూ. 5 కోట్లు కేటాయించారని ఆయన చెప్పారు. అందులో భాగంగా సిటీ స్కాన్ పరికరం ఏర్పాటుకు రూ. 4 కోట్లు ఖర్చు పెడుతున్నట్లు ఆయన చెప్పారు. వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటి కృష్ణబాబు అతి పెద్ద ఆసుపత్రి అయినా గుంటూరుకు రెండో సిటీ స్కాన్ పరికరం అవసరమని భావించి బడ్జెట్ విడుదల చేసారని ఆయన చెప్పారు. సివిల్ సర్జన్ ఆర్ ఎం ఓ డాక్టర్ సతీష్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ ఆశ సజని పాల్గొన్నారు.

మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ వైసిపికి రాజీనామా

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ దొడ్డక శివపార్వతి, వైసిపి సీనియర్ నాయకులు దొడ్డక కృష్ణ వైసిపికి గురువారం రాజీనామా చేశారు. పార్టీ మారి వచ్చిన వారిని అందలమెక్కిస్తూ, తమను ఎమ్మెల్యే ఆర్కే మనుషులుగా భావించి, పార్టీ కార్యక్రమాలకు సమాచారం ఇవ్వకుండా దూరం పెడుతున్నారని, దీంతో మనస్థాపం చెంది పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు వారు రాజీనామా లేఖలో పేర్కొన్నారు.

20న కుట్టు శిక్షణా కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్
ఉత్తర అమె రికా తెలుగు సంఘం (నాట్స్) వారి సహకారంతో పెదనందిపాడు తేళ్ళ నారాయణ విజ్ఞాన కేంద్రంలో 20వ తేదీ ఉదయం 10 గంటలకు కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభిస్తున్నామని విజ్ఞాన కేంద్రం కన్వీనర్ జంపని రామారావు గురువారం మీడియాతో తెలిపారు. మహిళలు కుట్టు శిక్షణ నేర్చుకోవడం ద్వారా స్వయం ఉపాధి లభిస్తుందని, పెరుగుతున్న ధరల నేపథ్యంలో కుటుంబ ఆదాయం పెంచుకోవడానికి ఇది తోడ్పడుతుందని తెలిపారు. ఆసక్తిగల మహిళలు, యువతులు పెదనందిపాడు లోని విజ్ఞాన కేంద్రం వద్ద తమ పేర్లు నమోదు చేయించుకోవాల్సిందిగా కోరారు. ప్రారంభ కార్యక్రమంలో శాసనమండలి సభ్యులు కె ఎస్ లక్ష్మణరావు, మాజీ ఎంపీపీ ముద్దన నాగరాజుకుమారి, పిఏఎస్ కళాశాల ప్రిన్సిపాల్ గుర్రం వీర రాఘవయ్య పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో కేంద్రం ట్రస్టీ కన్వీనర్ డి రమేష్‌బాబు, సభ్యులు ఎం వెంకటేశ్వర్లు, కె వి శివరావు, డి శ్రీనివాసరావు, చుక్కా యానాదులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని కమిషనర్‌కు వినతి

ప్రజాశక్తి మంగళగిరి
గ్రామ, వార్డు సచివాలయ హెల్త్ సెక్రటరీ ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం ఏపీ యునైటెడ్ విలేజ్ అండ్ వార్డ్ హెల్త్ సెక్రటరీల వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆరోగ్య శాఖ కమిషనర్ నివాస్‌ను ఆయన కార్యాలయం కలిసి వినతిపత్రం అందజేశారు. హెల్త్ సెక్రటరీల ఎఫ్ టి ఏ, కిట్, యూనిఫామ్ అలవెన్స్, స్టిచ్చింగ్ అలవెన్స్ ఇతర సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. సమస్యలపై కమిషనర్ సానుకూలంగా స్పందించారని యూనియన్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఏవి నాగేశ్వరరావు, కె అన్నమ్మ, మాధవి, ప్రభారాణి, సుభాషిణి తధితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి పొన్నూరు రూరల్ :పర్యావరణ పరిరక్షణ సమాజంలో అందరి బాధ్యత అని నేషనల్ గ్రీన్‌కోర్ ఎపి సంచాలకులు పి స్రవంతి తెలిపారు.గురువారం ఆమె పొన్నూరు పట్టణంలోని శ్రీవేద, సెయింట్ ఆన్స్, వివేక ఫాస్టర్ స్కూల్, ఎన్ఎన్‌టి, స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలను సందర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాం అమలు చేస్తామన్నారు. ఈ అంశంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల విద్యార్థులకు శిక్షణ ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధి కారులు రుద్రపాటి శోభాచంద్, శ్రీనివాసరెడ్డి, గ్రీన్ కోర్ జిల్లా సమన్వయకర్త షేక్ గౌసుల్ మీరా, జిల్లా సైన్స్ అధికారి ఎ.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

18న సొసైటీ ప్రతినిధుల సమావేశం

ఏపీ కో-ఆపరేటివ్ సొసైటీస్ ఫెడరేషన్‌గా ఏర్పడదాం

కాకతీయ కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ చైర్మన్ డిఎల్ కాంతారావు పిలుపు

ప్రజాశక్తి-తెనాలి
జాతీయ బ్యాంకులు, అర్బన్ బ్యాంకులతో సమానంగా ప్రజలకు సేవలందిస్తున్న క్రెడిట్ కోఆపరేటివ్ సొసైటీల ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఏపి కోఆపరేటివ్ సొసైటీస్ ఫెడరేషన్‌గా ఏర్పాటు కావటం అనివార్యమని కాకతీయ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ చైర్మన్ దావూలూరి లక్ష్మీకాంతారావు అన్నారు. స్థానిక కొత్తపేటలోని సొసైటీ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ క్రెడిట్ కోఆపరేటివ్ సొసైటీలు పరస్పర సహకారంతో పనిచేయాలన్నారు. జాతీయ బ్యాంకులతో పాటు అన్ని రకాల రుణాలు అందిస్తున్నా, రుణాల రికవరీలో కొన్ని సమస్యలున్నాయన్నారు. ఆయా సమస్యల కోసం కోఆపరేటివ్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయిస్తే ఏళ్ళకొలదీ జాప్యం జరుగుతోందన్నారు. అయితే అర్బన్ బ్యాంకులకు సేల్ ఆఫీసర్ ద్వారా రుణాల రికవరీ అవకాశం ఉందని, అదే పంథాలో కోఆపరేటివ్ సొసైటీలు కూడా రుణాల రికవరీ పొందాలంటే ఫెడరేషన్‌గా ఏర్పడి సొసైటీలకు కూడా సేల్ ఆఫీసర్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరవచ్చునన్నారు. శాసనసభలో దీనికోసం చట్టం చేయించుకోవాల్సిన అవసరం కూడా ఉందన్నారు. ఫలితంగా రుణాల రికవరీలో రాజకీయ నాయకుల జోక్యాన్ని

సమావేశంలో మాట్లాడుతున్న డిఎల్ కాంతారావు

కూడా నియంత్రించవచ్చునన్నారు. దీనిపై ఏపి కోఆపరేటివ్ అర్బన్‌బ్యాంక్ అండ్ కోఆపరేటివ్ సొసైటీస్ కార్యదర్శి రాఘవేంద్రరావును, ఎం.ఆంజనేయులును కూడా కలిసి చర్చించినట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో ఫెడరేషన్ ఏర్పాటుకు విధి విధానాలపై చర్చించేందుకు ఈనెల 18న సొసైటీ కార్యాయయంలో ఉదయం 10.30 గంటలకు నిర్వహించే సమావేశంలో క్రెడిట్ కోఆపరేటివ్ సొసైటీల ప్రతినిధులంతా హాజరుకావాల్సిందిగా కోరారు. సమావేశంలో కాకతీయ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ డైరెక్టర్లు వేదంతం సుబ్రహ్మణ్యశాస్త్రి, షేక్ ఖలీల్, సిఇవో కనమర్తపూడి ఝాన్సీలక్ష్మి, పిఆర్వో చెరుకూరి సతీష్ పాల్గొన్నారు.

18న సొసైటీ రెండవ అంతస్తు ప్రారంభం

కాకతీయ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ సొంత భవనంలో నూతనంగా రెండవ అంతస్తు నిర్మాణం పూర్తయ్యిందని, దాని ప్రారంభోత్సవం కూడా ఈనెల 18నే జరుగుతుందని చైర్మన్ దావులూరి లక్ష్మీ కాంతారావు వెల్లడించారు. సొసైటీ డైరెక్టర్లు, కార్యవర్గం, సభ్యులు పాల్గొనాల్సిందిగా ఆయన కోరారు.

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు

పుట్టగొడుగుల పెంపకంపై కెఎల్‌యులో శిక్షణ

ప్రజాశక్తి, తాడేపల్లి రూరల్
కెఎల్ డీమ్డ్ యూనివర్శిటీలోని కెఎల్ వ్యవసాయ కళాశాల అధ్వర్యంలో గురువారం పుట్టగొడుగుల పెంపకంపై హ్యాండ్స్-ఆన్ ట్రైనింగ్ పేరుతో మూడు రోజుల శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ప్రముఖ పుట్టగొడుగుల పెంపకం శిక్షకులు తోట జయచంద్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. తనుశ్రీ మష్రూమ్స్ అనే సంస్థ ద్వారా వ్యవసాయ విభాగ విద్యార్థులకు పుట్టగొడుగుల పెంపకం గురించి అవగాహన కల్పించారు. కెఎల్ వ్యవసాయ కళాశాల డైరెక్టర్ డాక్టర్ పి. రత్న ప్రసాద్ మాట్లాడుతూ భారతదేశ వ్యవసాయ భూభాగంలో పుట్టగొడుగుల పెంపకం యొక్క ఆవశ్యకత గురించి వివరించి చెప్పారు. వ్యవసాయ పద్ధతులు మరియు ఆహార భద్రత రెండింటిపై సానుకూల ప్రభావం చూపుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో విసి డాక్టర్ పార్థసారధి వర్మ, ప్రొఫెసర్ ఎవిఎస్ ప్రసాద్, వ్యవసాయ విభాగాధిపతి డాక్టర్ బి.బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చైల్డ్ రైట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాలమేళా

ప్రజాశక్తి - చేబ్రోలు
మండలంలోని శేకూరు జడ్‌పిహెచ్ స్కూలులో చైల్డ్‌రైట్స్ అడ్వకేసి ఫౌండేషన్ -క్రాప్ ఆధ్వర్యంలో బాలమేళా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో గ్రామ సర్పంచ్ మాతంగి శ్యామల మాట్లాడుతు ఆటలతో బాలల్లో ప్రతిభను వెలికి తీయవచ్చన్నారు. బృందాలుగా ఆడుకోవడం వలన స్నేహపూరిత వాతావరణం ఏర్పడుతుందన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇంచార్జ ప్రధానోపాధ్యాయులు బి. ముత్యాలరావు మాట్లాడుతూ విద్యార్థి జీవితంలో చదువు, ఆట, పాటలు ఒక భాగమని, చిన్న వయసు నుండే జీవన నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు పెంపొందించు కోవాలన్నారు. విద్యార్థులకు ఏమైనా సమస్య ఎదురైతే చైల్డ్‌హెల్ప్‌లైన 1098, డయల్‌టు పోలీస్ 100, ఉమెన్ హెల్ప్‌లైన్ 181కు తెలియజేయాలని సూచించారు. క్రాప్ కోఆర్డినేటర్ జి వెంకట్ మాట్లాడుతు విద్యార్థులకు మూడు కేటగిరీలుగా నిర్వహించిన పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు పాల్గొన్న 160 మందికి ప్రోత్సాహక బహుమతుల ప్రకటించామన్నారు. అనంతరం సభలో విజేతలకు బహుమతులను అతిధులు అందజేశారు. కార్యక్రమంలో జడ్‌పిహెచ్ ఉపాధ్యాయులు వివిడి కిషోర్, సుబ్బారావు, సచివాలయ సిబ్బంది, అంగన్వాడీ వర్కర్స్ పాల్గొన్నారు.

ధర్మ బిక్షం చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రజా నాయకులు ధర్మబిక్షంకు నివాళి

ప్రజాశక్తి - మంగళగిరి
ఉత్తమ విలువలతో రాజకీయ నాయకుల్లాగా కాకుండా ప్రజా సేవకుడుగా నైతిక విలువలతో నిబద్ధతతో పని చేసిన జాతీయ గీత పనివార్ల సంఘం మాజీ అధ్యక్షులు, సిపిఐ సీనియర్ నాయకులు ధర్మబిక్షం అని రాష్ట్ర గీత పనివారాల సంఘం నాయకులు, సిపిఐ మంగళగిరి నియోజకవర్గ సహాయ కార్యదర్శి కంచర్ల కాశయ్య అన్నారు. గీత పనివారాల సంఘం ఆధ్వర్యంలో ధర్మ బిక్షం 102వ జయంతి సందర్భంగా మంగళగిరి ప్రెస్ క్లబ్‌లో గురువారం సభ నిర్వహించారు. స్వతంత్ర పోరాటంలో పోరాడిన యోధుడని, కార్మికుల కోసం అనేక పోరాటాలు చేసి కార్మిక పక్షపాతిగా గుర్తింపు తెచ్చుకున్న వ్యక్తి ధర్మబిక్షం అని వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది వాకా రామ్ గోపాల్ గౌడ్, సిపిఐ నాయకులు చిన్ని తిరుపతయ్య, వివిధ సంఘాల నాయకులు పందేటి సాంబశివరావు, జాలాది జాన్ బాబు, భూపతి, రమేష్, వాకా మంగారావు, వాకా మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

'నమస్తే' పథకంలో రిజిస్టర్ చేసుకోండి : కమిషనర్

ప్రజాశక్తి-మంగళగిరి
కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెట్టిన (నేషనల్ యాక్షన్ ఫర్ మెకనైజ్డ్ శానిటేషన్ ఎకోసిస్టం) నమస్తే పథకంలో ఎంటిఎంసి పరిధిలో మలమురుగు, సెప్టిక్ ట్యాంక్ శుభ్రపరిచే కార్మికులందరూ నమోదు చేసుకోవాలని తెలిపారు. 19వతేదీ ఉదయం 10గంటల నుండి మంగళగిరి మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించే నమస్తే పథకం ప్రొఫైలింగ్ క్యాంప్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని ఎంటిఎంసి కమిషనర్ వి నిర్మల్‌కుమార్ గురువారం తెలిపారు. కార్మికుల జీవన భద్రత, మెరుగైన ఉపాధి కల్పనే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం ఈ పథకం ప్రవేశపెట్టిందని తెలిపారు. నమోదైన వారికి ప్రభుత్వం నుండి ప్రత్యేక సదుపాయాలు అందుతాయని, ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా రెట్టింపు వైద్య సహాయం అందుతుందని, అవకాశాన్ని కార్మికులు ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమములో అడిషనల్ కమిషనర్ ఎన్. ప్రకాశరావు , డిప్యూటీ కమిషనర్ బి.శివారెడ్డి పాల్గొన్నారు.

విజేతలను అభినందిస్తున్న లావు రత్తయ్య, తదితరులు

చందూస్ సిల్వర్‌కప్ విజేత విజ్ఞాన్స్ జట్టు

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు జేకేసీ కళాశాల ఆధ్వర్యంలో అధ్యాపకుల కోసం ప్రతిఏటా నిర్వహించే 27వ ఎడిషన్ చందూస్ సిల్వర్‌కప్ క్రికెట్ టోర్నమెంట్‌ను విజ్ఞాన్స్ యూనివర్సిటీ వరుసగా రెండవసారి గెలిచి ట్రోఫీని గెలుచుకుంది. స్థానిక జేకేసీ కళాశాలలోని క్రికెట్ గ్రౌండ్‌లో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీ జట్టు, నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాల జట్టుపై 94 పరుగుల తేడాతో విజయం సాధించింది. విజ్ఞాన్స్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో వికెట్లు నష్టపోకుండా 206 పరుగులు చేసింది. తర్వాత 207 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాల 15.4 ఓవర్లలో 112 పరుగులకు ఆలౌట్ అయ్యింది. జేకేసీ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ జాగర్లమూడి మురళీమోహన్ చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందజేశారు. విజయం సాధించిన విజ్ఞాన్స్ జట్టుకు విజ్ఞాన్స్ అధినేత డాక్టర్ లావు రత్తయ్య, వీసీ ప్రొఫెసర్ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్ అభినందనలు తెలిపారు.

చిప్స్‌లో వ్యక్తిత్వ వికాస కార్యక్రమం

ప్రజాశక్తి-గుంటూరు

మాట్లాడుతున్న జగన్నాథరావు

చేబ్రోలు హనుమయ్య ఫార్మసీ కాలేజీలో బి.ఫార్మసీ, ఫార్మా డి విద్యార్థులకు గత ఐదు రోజులుగా నిర్వహించిన పర్సనాలిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ గురువారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ప్రముఖ సైకాలజిస్ట్, మోటివేషనల్ స్పీకర్ డాక్టర్ జగన్నాధరావు పాల్గొని విద్యార్థులు కెరియర్‌ను ఎలా అభివృద్ధి చేసుకోవాలి, విజయం ఎలా సొంతం చేసుకోవాలి, లక్ష్యాన్ని ఏవిధంగా చేరుకోవాలి, కాలాన్ని మనకు అనుకూలంగా ఏవిధంగా మార్చుకోవాలి, మన అభివృద్ధిలో తల్లిదండ్రుల పాత్ర తదితర అంశాలపై ఐదురోజులపాటు శిక్షణలో ప్రసంగించారు. కార్యక్రమానికి జగన్నాధరావును కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.విద్యాధర అభినందించారు.

టిజెపిఎస్ కాలేజీలో క్విజ్ పోటీలు

ప్రజాశక్తి-గుంటూరు

శశిభూషణ్‌కు సన్మానం చేస్తున్న ప్రిన్సిపల్ తదితరులు

స్థానిక టిజెపియస్ కళాశాల వాణిజ్యశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో గురువారం ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అంతం కళాశాల పరిధిలో వాణిజ్య శాస్త్రం క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా చార్టెడ్ అకౌంటెంట్ జి.యన్.వి.శశిభూషణ్ హాజరై విద్యార్థుల మనోవికాసానికి క్విజ్ పోటీలు దోహదం చేస్తాయని, రీజనింగ్, మెంటల్ ఎబిలిటీ, కరెంట్ అఫైర్స్, జనరల్ నాలెడ్జి, పోటీ పరీక్షలలో నెగ్గే సామర్థ్యం ఏర్పడుతుందని చెప్పారు. ఈ పోటీలలో వివిధ కళాశాలల నుండి 35 జట్లు పాల్గొన్నాయని కళాశాల ప్రిన్సిపాల్ మేజర్ ఏబిపి మనోహర్ గారు తెలియచేశారు. ఈ పోటీల్లో జెకెసి కాలేజి ప్రథమ బహుమతి, గుంటూరు ప్రభుత్వ మహిళా కాలేజి ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుపొందాయి. కార్యక్రమంలో పిజి కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్. యస్.అనితాదేవి, డాక్టర్. యస్. శ్రీనివాసరావు, జి.సురేష్‌కుమార్, డాక్టర్.చంద్రశేఖర్, డాక్టర్ నాగనిర్మల, డాక్టర్.జె.వి.సుధీర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జిజిహెచ్‌లో మంత్రి రాంబాబుకు వైద్యపరీక్షలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ప్రభుత్వ ఆసుపత్రి లో గురువారం వైద్య పరీక్షలు చేయించుకున్నారు. గొంతు నొప్పితో బాధ పడుతుండటంతో వైద్య పరీక్షల కోసం ప్రభుత్వ ఆసుపత్రి ఇఎన్‌టి విభాగానికి వచ్చి పరీక్షలు చేయించుకున్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ నేతృత్వంలో ఈ వైద్య పరీక్షలు జరిగాయి. ఈ సందర్భంగా అంబటి మాట్లాడుతూ కార్పొరేట్ ప్రభుత్వ ఆసుపత్రులకు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రులను సిఎం జగన్ అభివృద్ధి చేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ ఆసుపత్రి లో మెరుగైన వైద్యం జరుగుతుందని నమ్మకంతో ఇక్కడకు వచ్చినట్లు ఆయన తెలిపారు. గొంతు నొప్పి ఉండటం వల్ల ఈఎన్టి ఓ పి కి వచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి వైద్య, విద్య ఫలాలు ప్రతి పేదవారికి అందాలన్న నిశ్చయంతో ఉన్నారని ఆయన చెప్పారు. జిజిహెచ్‌లో వైద్య సేవల పై ఆయన సంతృప్తి వ్యక్తం చేసారు.

ఆస్పత్రికి తగ్గిన డయేరియా రోగుల తాకిడి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి లో డయేరియా సమస్యతో బాధపడుతూ గురువారం సాయంత్రం వరకు 84 మంది చికిత్సపొందుతున్నారు.గత వారం రోజుల్లో వాంతులు,విరోచనాల సమస్యలతో మొత్తం 183 మంది చికిత్సకువచ్చారు. వారిలో 99 మంది డిశ్చార్జీ అయ్యారు. ప్రస్తుతం 84 మంది చికిత్స పొందుతున్నారు. అందరి ఆరోగ్యం నిలకడగా ఉంది. ఇద్దరు వయోవద్దుల పరిస్థితి ఆందోళన కరంగా ఉంది. సూపర్ స్పెషలిటి వైద్యుల పర్యవేక్షణ లో వైద్యం జరుగుతుంది. బుధవారం రాత్రి నుంచి ఆసుపత్రి కి వచ్చే రోగుల సంఖ్య కొంత తగ్గింది. బుధవారం రాత్రి ఏడుగురు, గురువారం ఉదయం 10 మంది చికిత్సకువచ్చారు. వైద్య సేవలు మెరుగ్గా ఉన్నాయని అవసరమైన రోగులకు అన్నీ రకాల మందులు, డయాలసిస్ సౌకర్యం ఇస్తున్నారని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ చెప్పారు.

10వ తరగతి విద్యార్థులకు 17,18న ప్రజ్ఞా వికాస పరీక్ష

పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, నాయకులు

ప్రజాశక్తి-గుంటూరు :ఎస్‌ఎఫ్‌ఐ, యుటిఎఫ్, జెవివి ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు ఈనెల 17, 18 తేదీల్లో ప్రజ్ఞా వికాస మోడల్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పరీక్ష రాష్ట్ర కన్వీనర్, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు తెలిపారు. గురువారం స్థానిక ఎస్‌ఎఫ్‌ఐ కార్యాలయంలో విలేకరుల సమావే శంలో పరీక్ష పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షల్లో ప్రశ్నాపత్రంపై అవగాహన కోసం, పరీక్షల పట్ల భయాన్ని తొలగించేందుకు అనుభజ్ఞులైన ఉపాధ్యాయు లతో ప్రశ్నాపత్రం రూపొందించి మోడల్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కావున ప్రతి విద్యార్థి వినియోగించుకోవాలని, యాజ మాన్యాలు, ఉపాధ్యాయులు సహకరించా లని కోరారు. గత 15 ఏళ్ల నుండి దిగ్విజయంగా ఈ మోడల్ పరీక్షను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి యం.కిరణ్ మాట్లాడుతూ జిల్లాలో ప్రతి మండలంలో ఈ పరీక్ష నిర్వహిస్తున్నామని, స్కూలు స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు ఈ పరీక్షలో ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో జెవివి జిల్లా కార్యదర్శి బి.ప్రసాద్, నాయకులు వెంకట్రావు, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి పవన్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షురాలు సుచరిత, నాయకులు ఆరిఫా, శ్రీలక్ష్మి, రూపాస్ పాల్గొన్నారు.

అద్భుతాల సృష్టికర్తలు ఇంజినీరింగ్ విద్యార్థులు

ఆర్‌విఆర్ ఫెస్ట్‌ను ప్రారంభించిన సినీ డైరెక్టర్ బోయపాటి శ్రీను

ఆర్‌విఆర్ ఫెస్ట్‌ను ప్రారంభిస్తున్న బోయపాటి శ్రీను తదితరులు

ప్రజాశక్తి-గుంటూరు :ప్రపంచంలో అద్భుతాలను సృష్టించేది ఇంజినీరింగ్ విద్యార్థులేనని, క్రమశిక్షణతో కూడిన విద్య ఉజ్వల భవిష్యత్తుకు నాంది పలుకుతుందని ప్రముఖ చలనచిత్ర దర్శకులు బోయపాటి శ్రీను పేర్కొన్నారు. స్థానిక చౌడవరంలోని ఆర్‌విఆర్ అండ్ జెసి.ఇంజినీరింగ్ కాలేజిలో రెండ్రోజు లపాటు నిర్వహించనున్న కొలరిడో-2024 పేరుతో జరుగుతున్న నేషనల్ లెవెల్ టెక్నికల్, కల్చరల్, అండ్ స్పోర్ట్స్ ఫెస్ట్ గురువారం ఘనంగా ప్రారంభం అయ్యింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న బోయపాటి మాట్లాడుతూ తాను కూడా జెకెసి కళాశాల నుండే విద్యనభ్యసించి గురువులు నేర్పిన క్రమశిక్షణతో, తాను ఎంచుకున్న రంగంలో ఉన్నత స్థానంలో రాణించడం గర్వకారణంగా ఉందన్నారు. యువత సమాజ శ్రేయస్సులో భాగస్వాములవ్వాలన్నారు. ప్రతి విద్యార్థికి జీవితంలో ఎదురయ్యే సంఘటనలను ఆలోచనలతో బ్యాలెన్స్ చేసుకుంటేనే ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవచ్చని బోయపాటి పేర్కొన్నారు. ఈ సందర్భంగా బోయపాటి శ్రీనును కళాశాల అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ రాయపాటి గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ దుశ్శాలువా కప్పి, మెమొంటోతో ఘనంగా సత్కరించారు. జాతీయ స్థాయిలో జరుగుతున్న ఫెస్ట్‌లో వివిధ రాష్ట్రాల నుండి 5,100 మంది విద్యార్థులు పాల్గొన్నారని ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థులు కల్చరల్ కార్యక్రమాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో కళాశాల పాలక మండలి సభ్యులు పి.గోపిచంద్, డైరెక్టర్లు డాక్టర్ కె.రవీంద్ర, డాక్టర్ ఎన్.వి.శ్రీనివాసరావు, నిర్వాహక కన్వీనర్ డాక్టర్ పొన్నం కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీలో వినూత్నంగా ఫైన్‌ఆర్ట్స్ పరీక్షలు

ప్రజాశక్తి - ఎఎన్‌యు :ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంలోని ఫైన్ ఆర్ట్స్ విభాగం బ్యాచిలర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ (బిఎఫ్ఎ) 3వ సంవత్సరం మిడ్ ప్రాక్టికల్ పరీక్షలు వినూత్నంగా యూనివర్సిటీ రూసా భవనం వద్ద ఉన్న సిమెంట్ బల్లలు, దూర విద్యా కేంద్రం ఎదుట చెట్లు, బల్లలు పైన సృజనత్మకంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఫైన్ ఆర్ట్స్ అధ్యాపకులు డాక్టర్ జాన్ రత్న బాబు మాట్లాడుతూ సహజంగా తరగతి గదుల్లో, ల్యాబ్‌లో ఆర్ట్ స్టూడియోలో పేపర్, కాన్వాస్లను ఆన్సర్ షీట్స్‌గా ఎగ్జామ్స్ నిర్వహిస్తారు. కానీ సిమెంట్ బల్లలను, చెట్లను ఆన్సర్ షీట్స్‌గా డ్రాయింగ్ అండ్ కంపోజిషన్ సబ్జక్ట్స్ పై ఇంటర్నల్ మిడ్ ఎగ్జామ్స్ నిర్వహించడం తన సృజత్మకతకు నిదర్శనమన్నారు. ఈ తరహా పరీక్షలు ఫైన్ ఆర్ట్స్ విభాగంలో నిర్వహించడం దేశంలోనే మొదటి సారి అని నాక్ విజిట్ దృష్టిలో ఉంచుకుని యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య పి. రాజశేఖర్ ఆలోచనలకు దగ్గరగా వర్సిటీ బ్యూటిఫికేషన్‌లో భాగంగా ఈ నిర్ణయం తీసుకునట్లు పేర్కొన్నారు. సొంత ఖర్చులతో విద్యార్థుల మెటీరియల్ సమాకూర్చిట్లు డాక్టర్ రత్న బాబు తెలిపారు. ఫైన్ ఆర్ట్స్ విద్యార్థుల సిమెంట్ ఫ్లాక్స్ చిత్రికరించిన డిజైన్స్, రంగులు చూపారులను విశేషం గా ఆకర్షస్తున్నాయి. ఈ పరీక్షలో విద్యార్థులు, సుకన్య, నాగలక్ష్మి, వాగ్దేవి, శివాజి, రాము, సోనూ దాస్, బీమేష్ ల గ్రూప్ చిత్రికరించిన డిజైన్స్ ఆలోచింపజేస్తున్నాయి.

పోస్టల్ కాలనీలో పార్కు ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరంలో ఆహ్లాదకరమైన వాతావరణం, పచ్చదనం పెంపుదలకు పలు పార్కులను అభివద్ధి చేస్తున్నామని రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖామంత్రి విడదల రజిని అన్నారు గురువారం నగరంలోని 49వ డివిజన్ పోస్టల్ కాలనీలో రూ.25 లక్షలతో నగర పాలకసంస్థ అభివద్ధి చేసిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పోస్టల్ కాలనీ పార్కును నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు, ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ పార్క్‌లో వాకింగ్ ట్రాక్, ఓపెన్‌జిమ్, పిల్లల ఆట వస్తువులు, గ్రీనరీ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పార్కుల అభివద్ధితో పాటు నగరంలో అవసరమైన ప్రాంతాలలో మౌలిక సదుపాయలను ఏర్పాటు చేస్తున్నామని తెలియచేశారు. తొలుత శిలా పలకాన్ని ఆవిష్కరించి, పార్క్ ప్రధాన ద్వారాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంబించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బోడపాటి ఉషారాణి కిషోర్‌కుమార్, అందుగుల సంతోష్, జిల్లా గ్రంధాలయాల పరిషత్ చైర్మన్ బత్తులు దేవానంద్ పాల్గొన్నారు.

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి విడదల రజిని, తదితరులు